ప్రజాశక్తి

శనివారం 10 ఫిబ్రవరి 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



జాషువా కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు, జడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్

జాషువా స్ఫూర్తితో బడుగుల అభ్యున్నతికి కృషి

కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ఇన్‌ఛార్జి మంత్రి నాగార్జున

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

గుర్రం జాషువా స్ఫూర్తితో బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. ప్రకాశం భవనం ప్రాంగణంలో గుర్రం జాషువ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గుర్రం జాషువ కాంస్య విగ్రహాన్ని శుక్రవారం సాయంత్రం మంత్రులు నాగార్జున, ఆదిమూలపు సురేష్, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్ కుమార్, గుర్రం జాషువ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య, కార్యదర్శి ఎండ్లూరి రవికుమార్‌తో కలసి ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన జాషువ సాహిత్య జయభేరి మహాసభలో జాషువ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సాహిత్య రంగంలో విశేష కృషి చేసిన శ్రీరామకవచం సాగర్, డాక్టర్ ఎజ్రా శాస్త్రి, డాక్టర్ రవికుమార్, డాక్టర్ బద్దిపూడి జయరావు, ప్రముఖ కవయిత్రి సింహాద్రి జ్యోతిర్మయిలను ఘనంగా సన్మానించారు.

ఉద్యోగం రాలేదని.. వికలాంగురాలు ఆత్మహత్య

▶ మెయిన్ లో

సిఎంను కలిశాకే ఏదైనా..?

- కుమారుడు ప్రణీత్‌రెడ్డికి గిద్దలూరు టిక్కెట్‌పై తర్జనభర్జనలు
- నాలుగు రోజులుగా విజయవాడలోనే ఉన్న 'బాలినేని'



ప్రణీత్, బాలినేని శ్రీనివాసరెడ్డి (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

సిఎం జగన్‌ను కలిసి అన్ని వ్యవహారాలపై చర్చించి.. స్పష్టత వచ్చాకే రాజకీయంగా ముందుకెళ్లాలని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి భావిస్తున్నారు. ఆయన అసెంబ్లీ సమావేశాల సందర్భంగా విజయవాడ వచ్చారు. అయితే సమావేశాలకు వెళ్లలేదు. విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లోనే ఆయన బస చేశారు. అక్కడే పార్టీ నేతలు ఆయనను కలుస్తున్నారు. ఆయన కుటుంబసభ్యులు కూడా భేటీ అయ్యి.. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఒంగోలు పార్లమెంటు సీటుతో పాటు కొన్ని అసెంబ్లీ సీట్లపై అధిష్టానంతో చర్చించిన బాలినేనికి కొన్ని అంశాల్లో సానుకూలత లేదు. ఇప్పటికీ మాగుంట వ్యవహారంలోనే సందిగ్ధంగానే ఉన్నారు. దాన్ని తాత్కాలికంగా వదిలేసి ఆయన ఒంగోలులో పోటీకి సిద్ధమయ్యారు.

తాజాగా ఆయన తన కుమారుడి రాజకీయ భవితవ్యంపై దృష్టి సారించారు. తన కుమారుడు ప్రణీత్‌రెడ్డికి గిద్దలూరు టిక్కెట్టు ఇవ్వాలని పార్టీ నేతలను కోరినట్లు సమాచారం. పార్టీ నేత సజ్జలతోనూ, సిఎంఓ ముఖ్యకార్యదర్శి ధనుంజయరెడ్డితోనూ ఈ విషయాన్ని చర్చించినట్లు తెలిసింది. ఇది సిఎం జగన్ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సిన విషయం కావడంతో వారి నుంచి సానుకూల స్పందన వచ్చినట్లు కనిపించలేదని సమాచారం. అయితే ఇప్పటికే గిద్దలూరుకు మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని ప్రకటించారు. ఆయన శుక్రవారం నాడు మీడియా సమావేశం ఏర్పాటు చేసి తనకు సిఎం ఈ సారి గిద్దలూరు నుంచి పోటీచేసే అవకాశం కల్పించారని, దీన్ని సువర్ణావకాశంగా భావిస్తున్నట్లు చెప్పారు. గిద్దలూరులో పోటీకి సిద్ధమయినట్లు వెల్లడించారు. మార్కాపురం ఎమ్మెల్యే హడావుడిగా చెప్పడం వెనుక వ్యూహాత్మకమేనంటున్నారు. గిద్దలూరు టిక్కెట్టును తన కుమారుడికి బాలినేని కోరుతున్నట్లుగా జిల్లాలో రాజకీయ వర్గాల్లోనూ చర్చ సాగుతోంది. దీనిపైనే ఆయన తర్జనభర్జన పడుతున్నారు. మరో వైపు కుటుంబీకులు రెండు సీట్లపైనే మీమాంసలో ఉన్నారు. ఒంగోలులో పోటీ చేస్తే సరిపోదా? అని బాలినేనితో కుటుంబీకులు సూచించారని సమాచారం. అయితే బాలినేని మాత్రం గిద్దలూరులో గెలుపునకు అవకాశాలు మెండుగా ఉన్నాయని, అక్కడ నుంచి తన కుమారుడిని ఎన్నికల్లో అరంగేట్రం చేయించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అందుకు అధిష్టానం నుంచి తనతో చర్చలు జరిపిన పెద్దలు ఎలా స్పందించారన్నదే ప్రశ్నగా ఉంది. వారి నుంచి సానుకూల స్పందన రానందున సిఎం జగన్‌ను కలిసి అన్ని విషయాలు చర్చించాకే ఒంగోలుకు రావాలనే ఆలోచనలో బాలినేని ఉన్నారు. సిఎంను కలిసేందుకు ప్రయత్నాల్లో ఉన్నారు. శనివారం లేదా సోమవారం కలుస్తారని చెబుతున్నారు. అయితే బాలినేని సిఎం జగన్‌ను కలుస్తారని చెబుతుండగా ఆయన కుమారుడు కూడా కలిసే అవకాశం ఉందని పార్టీనేతల్లో చర్చసాగుతోంది. అంటే ఆయనే కలుస్తారా? లేక ఆయన కుమారుడిని పంపుతారా? అనేదీ తేలనుంది. సిఎంను కలిశాక ఆయన చెప్పే సమాధానం బట్టి బాలినేని ముందుకు పోతారని తెలుస్తోంది. ఒంగోలులో పోటీతో సర్దుకుంటారా? లేక గిద్దలూరు విషయంపై గట్టిగా పట్టుబడతారా? అనేదీ చూడాలి. ఏదేమైనా బాలినేని వ్యూహాత్మకంగానే అడుగులు వేస్తున్నారు. ఇక ఎంపీ మాగుంట వ్యవహారంలో అధిష్టానం నిర్ణయంపై మెత్తబడ్డారనే చర్చ ▶ 2లో



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఆత్మస్థైర్యాన్ని నింపే బాలోత్సవం

- జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి
- ఇలాంటి ఉత్సవాలు ప్రభుత్వ పరిధిలో కూడా నిర్వహిస్తే బాగుంటుంది: కలెక్టర్
- పిల్లల్లో స్నేహభావం పెంపొందుతుంది..: విరవు
- ఉత్సాహంగా 'ప్రకాశం బాలోత్సవం'



బాలోత్సవ జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

పిల్లల్లో ప్రతిభాపాఠవాలను బాలోత్సవం ద్వారా వెలికితీయాలనుకోవడం మంచి ఉద్దేశమని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. పిల్లల్లో ఆత్మస్థైరాన్ని నింపి, వారిలో మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు బాలోత్సవాలు ఉపకరిస్తాయని పేర్కొన్నారు. ప్రకాశం బాలోత్సవం కార్యక్రమం శుక్ర, శనివారాలలో ఒంగోలు నగరంలోని పివిఆర్ బాలుర పాఠశాలలో జరుగుతున్నాయి. శుక్రవారం బాలోత్సవ జెండాను ఆవిష్కరించిన కలెక్టర్ అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. సభకు బాలోత్సవం అధ్యక్షులు పాటిబండ్ల ఆనందరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ పిల్లల్లో దేశభక్తిని పెంపొందించి, వారిలో ఐక్యతను ప్రతిష్ఠించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలందరూ ఒకచోట చేరి వారి ప్రతిభాపాఠవాలు ప్రదర్శిస్తుంటే ఎంతో ముచ్చటేస్తుందన్నారు. అందుకే ▶ 2లో



గిద్దలూరులో ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

అరెస్టులను ఖండిస్తూ..

ఆశా వర్కర్ల నిరసన


▶ 5లో

అక్రమంగా భూముల ఆన్‌లైన్

బదిలీపై వెళుతూ.. తహశీల్దార్ నిర్వాకం

ప్రజాశక్తి-గిద్దలూరు

గిద్దలూరు తహశీల్దార్ బదిలీపై వెళుతూ.. నిబంధనలకు విరుద్ధంగా పలు భూములను అక్రమంగా ఆన్‌లైన్ చేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని అంబవరం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 988లోని 2.99 ఎకరాల ప్రభుత్వ భూమి, సర్వే నెంబర్ 989లోని 7.5 ఎకరాల ప్రభుత్వ భూమి.. ఇంకా మండలంలోని పలు చోట్ల ఆయన బదిలీపై వెళ్లే చివరి రోజు అయిన జనవరి 31న హడావుడిగా నాన్ లోకల్ ▶ 2లో



ROR-1B

పట్టాదారుని పేరు :
తండ్రి/ భర్త పేరు :
ఖాతా నెంబరు : 2347 సర్వే నెం. : 988
భూమి వివరణ : మెట్ట విస్తీర్ణం : 2.99
యాజమాన్య రకం : కొనుగోలు
మ్యుటేషన్ ఆమోదించిన తేదీ : Jan 31 2024

1

పట్టాదారుని పేరు :
తండ్రి/ భర్త పేరు :
ఖాతా నెంబరు : 2347 సర్వే నెం. : 989
భూమి వివరణ : మెట్ట విస్తీర్ణం : 4.51
యాజమాన్య రకం : కొనుగోలు
మ్యుటేషన్ ఆమోదించిన తేదీ :

2

జనవరి 31న ఆన్‌లైన్ చేసిన దృశ్యం

ఏనుగుల పుల్లయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి-మార్కాపురం

కార్మిక, కర్షక, పేదల పక్షపాతిగా దివంగత ఏనుగుల పుల్లయ్య పశ్చిమ ప్రకాశంలో పేరు గడించారని పలువురు వక్తలు కొనియాడారు. సిపిఎం సీనియర్ నాయకులు ఏనుగుల పుల్లయ్య 15వ వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక కోర్టు కూడలిలో శుక్రవారం నిర్వహించారు. హెడ్ పోస్టాఫీసు ఎదురుగా ఉన్న ఏనుగుల పుల్లయ్య విగ్రహానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ పోస్ట్‌మాస్టర్ షేక్ సుభాని మాట్లాడుతూ పోస్టల్ ఉద్యోగానికి తగిన న్యాయం చేస్తూనే మరోవైపు పోస్టల్ యూనియన్ ద్వారా ఉద్యోగుల సంక్షేమం కోసం పుల్లయ్య కృషి చేశారని అన్నారు. ఎపియూడబ్ల్యుజె రాష్ట్ర నాయకులు నూకని వెంకటరమణ మాట్లాడుతూ కళాశాల విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘానికి మార్గదర్శకత్వం వహిస్తూ అనేక కార్యక్రమాల్లో ముందుండి నడిపించారన్నారు. సిపిఎం మార్కాపురం పట్టణ కార్యదర్శి దగ్గుపాటి సోమయ్య మాట్లాడుతూ మార్కాపురం డివిజన్‌లో ప్రజాశక్తి తెలుగు దినపత్రికలో మొదటి విలేకరిగా పని చేశారన్నారు. నాగులవరం రోడ్డులో 1998లో 42 మందికి ఇళ్ల పట్టాలు ఇప్పించడంలో సిపిఎం నాయకుడిగా పుల్లయ్య కీలకంగా పని చేశారన్నారు. 1999లో దోర్నాల పట్టణంలో ఏర్పాటు చేసిన సుందరయ్య కాలనీలోని వందలాది మంది పేదలకు ఇళ్ల స్థలాలు,


పుల్లయ్యకు సిపిఎం నేతల నివాళి

పట్టాలు ఇప్పించి అక్కడి ప్రజల ఆదరాభిమానాలు పొందారన్నారు. తదనంతరం నివాస స్థలం లేని పేద ప్రజలందరితో కలిసి మార్కాపురం పట్టణంలో భగత్‌సింగ్ కాలనీ, సుందరయ్య కాలనీ, రాజ్యలక్ష్మినగర్, ఒంటెద్దు బండ్ల కాలనీలను ఏర్పాటు చేసి దాదాపు 3,000 మందికి ఇండ్ల స్థలాలు ఇప్పించిన ఘనత పుల్లయ్యదేనన్నారు. మాజీ డివైఎఫ్ఐ నాయకులు గాయం వెంకట నారాయణరెడ్డి, సిపిఎం మార్కాపురం మండల కార్యదర్శి గుమ్మా బాలనాగయ్య, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకుడు, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు వేశపోగు సుదర్శన్ మాట్లాడారు. సిపిఎం నాయకులు డికేఎం రఫీ, ఏనుగుల సురేష్ కుమార్, పీ రూబెన్, జవ్వాజి రాజు, కాశయ్య, విక్టర్, కట్టా సుబ్బారావు, తగరపు నాసరయ్య, జన విజ్ఞాన వేదిక నాయకులు ఏనుగుల రవికుమార్, ఏనుగుల సాయి, ఎస్ఎఫ్ఐ నాయకులు ఏనుగుల శివ, కొండయ్య, ప్రజాశక్తి ప్రతినిధులు వెన్నా శ్రీనివాసరెడ్డి, అల్లు వీరారెడ్డి పాల్గొన్నారు.

సిఎంను కలిశాకే ఏదైనా.?

(మొదటిపేజీ తరువాయి)

సాగుతోంది. మరోవైపు ఇప్పటివరకూ ఆయన వెంట ఉన్న సీనియర్‌నేతలతో పాటు కొందరు నేతలు కలిసి భవిష్యత్ వ్యూహంపైనా చర్చించారు. అన్ని వివాదాలను వదిలేయాలని, ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేద్దామనే ఆలోచనను బాలినేనికి సూచించారు. బాలినేనికి ఇష్టం లేకుండా ఇచ్చిన రెండు, మూడు స్థానాల్లో అభ్యర్థుల్లో ఇప్పటికీ గందరగోళం పోలేదు. బాలినేని భవితవ్యం, ఆయన తీసుకునే నిర్ణయాలపైనే దృష్టి సారించారు. ఏదేమైనా బాలినేని శనివారం లేదా సోమవారం నాడు సిఎం జగన్‌తో ఆయన గానీ, ఆయన కుమారుడు గానీ భేటీ అయ్యాకే తుది నిర్ణయం తీసుకోనున్నారు.

ఆత్మస్థైర్యాన్ని నింపే 'బాలోత్సవం'

(మొదటిపేజీ తరువాయి)

బాలోత్సవం కార్యక్రమానికి ఆర్థికంగా కూడా జిల్లా పరిషత్ నుంచి తోడ్పాటునందించామని వివరించారు. రానున్న ఏడాదికి జిల్లాలో ఇప్పటికంటే మెప్పుగా బాలోత్సవం జరగాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో బాలోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. రానున్న ఏడాదికి ఇంకా ఉత్సాహంతో, ఎక్కువ మంది పిల్లలతో నిర్వహించాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఉత్సవాలు ప్రభుత్వం పరిధిలో జరిగితే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. బాలోత్సవాల ద్వారా పిల్లల్లో సృజానాత్మకను వెలికితీయడం, వారిలో ఐక్యతను పెంపొందించడం అభినందనీయమని తెలిపారు. బాలోత్సవం విజయవంతం కావాలని, విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. మాజీ ఎంఎల్‌సి, విద్యావేత్త విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ భూమిని ఎలా కాపాడుకోవాలి, ఈ దేశాన్ని ఎలా నిలబెట్టుకోవాలనే అంశాలను నిత్యం బోధిస్తుంటామని, అయితే బాలోత్సవాల ద్వారా అలాంటి నినాదాలకు వేదికలిచ్చి వారిలో ఉన్న సామర్థ్యాలను వెలికితీయడం శుభపరిణామమని తెలిపారు. భవిష్యత్ చాలా గొప్పదనే విషయం పిల్లలను చూస్తే అర్థమవుతోందన్నారు. పిల్లలను మనం ప్రేమిస్తే వారు మనకు ప్రపంచాన్ని చూపుతారని, సమాజంలో ఉన్న మంచి, చెడులను ఉపాధ్యాయులు వారికి నిత్యం బోధిస్తూనే వారిలో ఉన్న నైపుణ్యాలకు ఊతమివ్వాలని కోరారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ పిల్లల్లో ఉన్న నైపుణ్యాలను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలని, వారిలో ఉండే నైపుణ్యాలను చాటుకునేందుకు మంచి వేదికలు కావాలని, అలాంటి కళలను చాటుకునే వేదికగా బాలోత్సవం నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ప్రతిభ విద్యాసంస్థల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పిల్లలు బాగుంటే సమాజం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో బాలోత్సవం వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మోజి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కలపాల సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ ఎస్ రవి, కన్వీనర్ డి వీరాంజనేయులు, జాయింట్ సెక్రటరి వి బాలకోటయ్య, అమరావతి బాలోత్సవం కన్వీనర్ రామరాజు, జిల్లా బాలోత్సవం సభ్యులు దామా శ్రీనివాసులు, కెఎఫ్ బాబు, డిఎల్ ప్రసాద్, సిహెచ్ వినోద్, కాట్రగడ్డ నరసింహారావు, జి హరిబాబు, జి ఉమామహేశ్వరి, చంద్రశేఖర్, జిల్లా డిప్యూటి డిఈఓ అనితారోజ్, ఎడి సురేఖ, పివిఆర్ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధిక, తదితరులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 83 పాఠశాలల నుంచి దాదాపు 3వేలమంది విద్యార్థులు మొదటిరోజు బాలోత్సవంలో పాల్గొన్నారు.

వంద రోజులు పని కల్పించాలి

ప్రజాశక్తి-మార్కాపురం

చెంచు కుటుంబాలకు నూరు రోజుల పని దినాలు కల్పించాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ కె శీనారెడ్డి కోరారు. మార్కాపురం క్లస్టర్ ఆఫీస్‌లో ఐటిడిఏ పరిధిలోని పెద్ద దోర్నాల, పుల్లలచెరువు, యర్రగొండపాలెం మండలాల్లో ఉపాధి హామీ పథకం సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శీనారెడ్డి మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి చెంచు గిరిజనుడికి పని కల్పించి ఉపాధి చూపాలన్నారు. ఈ సమీక్షలో జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి, అదనపు జిల్లా విజిలెన్స్ అధికారి వెంకటస్వామి, మార్కాపురం క్లస్టర్ ఏపీడి నిర్మలాదేవి, ఎంపీడీవోలు, ఏపీవోలు, టిఏలు, జూనియర్ టీఏలు పాల్గొన్నారు.

లక్కీడ్రాలో విజేతకు బహుమతి అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

బంగారు రుణాలకే పరిమితమైన ముత్తూట్ ఫిన్ కార్ప్ లిమిటెడ్ ఇప్పుడు సామాన్యుడికి అందుబాటులో ఉండేలా సరికొత్త రుణాలతో ముందుకొచ్చింది. గోల్డ్ రుణాలతో పాటు చిన్న తరహా వ్యాపార రుణాలు, ద్విచక్ర వాహన రుణాలు, గృహ రుణాలు, ఆస్తి తనఖా రుణాలు కూడా అందిస్తున్నారు. గత దీపావళి సందర్భంగా నిర్వహించిన పండుగ బడా ధమాకాలో లక్కీ డ్రాలో విజేతగా నిలిచిన ఒంగోలు బ్రాంచ్ చెందిన శ్యాంపల్లి వరలక్ష్మీ అనే కస్టమర్‌కి వాషింగ్ మిషన్‌ను బహూకరించారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ రత్నకుమార్, బ్రాంచ్ మేనేజర్ కత్తి అబ్రహాం, సిబ్బంది ఉన్నారు.


విజేతకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల: పెద్దదోర్నాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు శుక్రవారం సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ప్రకాశం గ్లోబల్ ఎన్నారై ఫోరం (పిజిఎన్ఎఫ్) ఆధ్వర్యంలో జరిగింది. గత నెలలో 75 సైకిళ్లు పంపిణీ చేశారు. విద్యార్థులు ఎక్కువమంది ఉన్నందున గుర్తించి ప్రస్తుతం మరో 75 సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా నిర్వాహకులకు అభినందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు వేణుగోపాల్, ఎంఈవో బి మస్తాన్‌నాయక్, గ్లోబల్ ఎన్ఆర్ఐ ఫోరం ఇంటర్నేషనల్ కన్వీనర్ గుళ్లాపల్లి శ్రీనివాస్, ఎఫర్ట్ సంస్థ కన్వీనర్ జెవి మోహన్‌రావు, పిజిఎన్ఎఫ్ బాధ్యులు డాక్టర్ కొర్రపాటి సుధాకర్, ఉపాధ్యాయులు నాగమూర్తి, ఓవి రవిశేఖర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రామానాయక్, కిరణ్ కుమార్, మీటే నాయక్, ఆవులయ్య పాల్గొన్నారు.

ఆన్‌లైన్ భూముల ఆన్‌లైన్..

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తులకు ఆన్లైన్ చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల నేపథ్యంలో గిద్దలూరు తహశీల్దార్ సీతారామయ్యకు కూడా బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. బదిలీపై వెళ్తున్నాననో.. ఏమి చేసి నా తనను ఎవరు అడుగుతారు అనుకున్నారో ఏమో తెలియదు గానీ ఆయన పనిచేసిన పనిదినాలలో కాకుండా బదిలీపై వెళ్తున్న చివరి రోజు ఆయన చేతివాటం ప్రదర్శించి.. పెద్ద మొత్తంలో ప్రభుత్వ భూములు అక్రమార్కులకు ఆన్‌లైన్ చేయడం విమర్శలకు తావిస్తోంది. 2007లో రిజిస్టర్ కాబడిన పత్రాల ఆధారంగా ఆన్లైన్ జరిపించారని, నిబంధనల ప్రకారం ప్రకారం ప్రభుత్వ భూమి అమ్మడం, కొనడం నేరమని చట్టాలు చెప్తున్నా వాటిని ఆయన తుంగలో తొక్కారు. రిజిస్ట్రార్ కార్యాలయంలో డిలీషన్ జాబితాలో ఉన్న ఆ భూములు లక్షల రూపాయలు చేతులు మారడంతోనే బదిలీల్లో చివరి రోజున ఆన్లైన్ పని కానిచ్చేశారని పలువురు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు అక్రమ ఆన్‌లైన్‌ను రద్దు చేయాలని కోరుతున్నారు.

ఆ ఉత్తమ తహశీల్దారే చేశారు: గర్రె శ్రీనాథ్, ఎంపీటీసీ

గణతంత్ర దినోత్సవం నాడు ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్న ఆయనే ఇలా ప్రభుత్వ భూములను అక్రమార్కులకు అప్పగించడం సరికాదని ఎంపీటీసీ గర్రె శ్రీనాథ్ అన్నారు. ఉన్నతాధికారులు విచారణ చేసి ఆ తహశీల్దార్‌పై చర్యలు తీసుకొని అక్రమార్కుల చేతిలో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

విచారణ చేయాలి: బి. నరసింహులు, పట్టణ పౌరసంఘం నాయకులు, గిద్దలూరు

మండలంలోని పలు ప్రభుత్వ భూములను అక్రమంగా ఆన్‌లైన్ చేసిన తహశీల్దార్ సీతారామయ్యపై ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకోవాలి. మండలంలో సీతారామయ్య పనిచేసిన కాలంలో ఆన్‌లైన్ చేసిన ప్రభుత్వ భూములన్నింటిపై విచారణ చేయాలి.

16న బంద్‌ను జయప్రదం చేయండి

స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి అయ్యపరెడ్డి

ప్రజాశక్తి -ఒంగోలు సబర్బన్

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన బిఎన్ఎస్ చట్టాన్ని రద్దు చేయాలని ఎపి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం. అయ్యపరెడ్డి పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్‌వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటి సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. మహ్మద్‌బేగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అయ్యపరెడ్డి మాట్లాడారు. భారతీయ న్యాయ సంహిత చట్టం 106లో ఒకటి, రెండు సెక్షన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బిఎన్ఎస్ చట్ట ప్రకారం యాక్సిడెంట్ జరిగితే డ్రైవర్‌ను బాధ్యుడిని చేయడం, పది సంవత్సరాల జైలుశిక్ష, రూ.10 లక్షలు జరిమానా విధిస్తారని తెలిపారు. ఇదే చట్టం దేశంలో అమలైతే దేశంలో డ్రైవర్ అనే వాడు ఉండడని తెలిపారు. పదేళ్ల డ్రైవర్ జైలుకుపోతే ఆకుటుంబాల పరిస్థితి ఎంటో ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్దేశం కార్పొరేట్ శక్తులకు రవాణారంగాన్ని అప్పగించడం అని వివరించారు. మోడీ ప్రభుతం మన దేశంలో రవాణారంగాన్ని దెబ్బతీసేందుకు పరుగులు పెడుతోందన్నారు. 16న జరిగే టైర్ బంద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ టైర్ బంద్ కార్యక్రమం విజయవంతం కోసం ఈనెల 16 వరకూ అన్నీ ప్రాంతాలలో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తూ కరపత్ర ప్రచారం, జనరల్‌బాడీ ప్రచారం, వాల్ పోస్టర్లు ఏర్పాటు, మైక్ ప్రచారాలను నిర్వహించి కార్మికులను సంయుక్తం చేసే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు బి.వి.రావు, శివన్నారాయణ, సుబ్బారావు, ఎఐటియుసి న్యూ జిల్లా కార్యదర్శి ఎంఎస్.సాయి, సుబ్బారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అయ్యపరెడ్డి

భూ సమస్యలు పరిష్కరించాలి : జేసీ

ప్రజాశక్తి-కురిచేడు

భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.గోపాల కృష్ణ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని గుంటక నాసర్ రెడ్డి కల్యాణ మండపంలో ప్రత్యేక స్పందన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేసీతో పాటు కనిగిరి ఆర్‌డిఒ పాలపర్తి జాన్ ఇర్విన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అధికారులకు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్దారు ఎవి. సుధాకర్, ఎంపిడిఒ సీతారామయ్య, ఇఒఆర్‌డి ప్రసాద్ , జడ్‌పిటిసి నుసుం వెంకట నాగిరెడ్డి, కురిచేడు సర్పంచి కేశనపల్లి కృష్ణయ్యా పాల్గొన్నారు.

దారి సమస్యను పరిష్కరించాలి..

కురిచేడు గ్రామ సర్వేనెంబరు 77లో పశువుల మేత భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎపి గొర్రెల,మేకల పెంపకం జిల్లా కార్యదర్శి తోట తిరుపతి రావు, దర్శికి చెందిన సంది వెంకటేశ్వర్లు స్పందన కార్యక్రమంలో జేసీ అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 77 సర్వే నెంబరులోని 20 ఎకరాల ప్రభుత్వ భూమికి మాజీ సర్పంచి తన అనుచరులకు పట్టాలు ఇప్పించినట్లు తెలిపారు. గొర్రెలు,మేకలను మేత తోలుకెళ్లే దండుబాటును సైతం ఆక్రమణను ఆక్రమించినట్లు తెలిపారు. దండుబాటలో గొర్రెలు, మేకలు మేతకు వెళ్లకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బొరిగొర్ల పెద్ద గాలి వెంకటయ్య, ముప్పా శ్రీనివాసరావు,ముప్పా పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న జేసీ

రోడ్డు భద్రతపై అవగాహన

కనిగిరి : రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా ప్రజా రవాణా శాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు.విద్యార్థులకు రోడ్డు భద్రతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ రోడ్డు భద్రత గురించి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తెలుసు కోవాలన్నారు. దేశంలో ప్రతి నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలిపారు. ప్రతి మూడు నిమిషాలకు రోడ్డు ప్రమాదంలో ఒకరు మత్యువాత పడుతున్నట్లు తెలిపారు. అతివేగం వల్లే ప్రమాదాలు ఎక్కువ శాతం జరుగుతున్నట్లు తెలిపారు. ఆర్‌టిసి డిపో మేనేజర్ బి.శ్రీమన్నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు అనంతరం వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ దేవరాజ్, పాఠశాల ప్రిన్సిపల్ పెరియా నయగ మేరీ, సిస్టర్ ఎలిజబెత్ రాణి, సిస్టర్ రాఖీని, ఆర్‌టిసి డిపో అసిస్టెంట్ మేనేజర్లు,ప్రజా రవాణా శాఖ ఉద్యోగులు, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ప్రతినిధులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి -కనిగిరి

బాండెడ్ లేబర్ నిర్మూలనా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి కె.భరత్ చంద్ర ఆధ్వర్యంలో అసంఘటిత కార్మికులు, దుకాణ, హోటల్ యజమానులకు మండల న్యాయ సేవాధికార సంస్థ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్, న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ మిల్లులు, ఇటుకల బట్టీలు, బేల్దారి పనులు, వ్యవసాయ రంగ పనుల్లో పిల్లలు, మహిళలు, పురుషులు బానిసలుగా పనిచేస్తున్నట్లు తెలిపారు. తండ్రి , తాతలు చేసిన అప్పులు తీర్చలేకపోతే పిల్లలతో వెట్టి చాకిరీ చేయిస్తున్న ఘటనలు ఇప్పటికీ సమాజంలో కనిపిస్తున్నట్లు తెలిపారు. వెట్టి చాకిరి నుంచి ప్రజలను విముక్తి చేయడానికి అందరూ సహకరించాలన్నారు. అనంతరం హోటళ్లు, టీ దుకాణాలలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సుబ్బరాయుడు, ఎన్‌బిసిసి సభ్యులు, కైలాస్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్, సార్డ్స్ సంస్థ కోఆర్డినేటర్ కిరణ్ కుమార్, న్యాయవాది షాహిద్, పారా లీగల్ వాలంటీర్, గుడ్ హెల్ప్ ప్రతినిధి రమేష్ బాబు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-దర్శి

విద్యుత్ ఎస్ఇ అన్సన్ ఆధ్వర్యంలో టౌన్ సెక్టార్ పరిధిలోని విద్యుత్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. దర్శి డిఇ కరీమ్ అధ్యక్షతన అధికారులు 42 బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. అదనపు లోడ్ వినియోగిస్తున్న వారికి రూ.1.50 లక్షల జరిమానా విధించారు. మీటర్లు లేకుండా విద్యుత్ వినియోగిస్తున్న 45 మందికి రూ.7.72 లక్షలు జరిమానా విధించినట్లు ఎస్ఇ అన్సన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఇఇ శ్రీనివాసులు, ఏడీఏ కే.పిచ్చయ్య, పొదిలి ఏడీఏ కె. శ్రీనివాసులు, దర్శి, పొదిలి, చీమకుర్తి విద్యుత్ అధికారులు పిచ్చయ్య, శ్రీనివాసరెడ్డి, వేణుగోపాల్, ఎఇలు, జెఇలు, విద్యుత్ లైన్‌మెన్, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటేశ్వరరెడ్డికి నివాళి

ప్రజాశక్తి- హనుమంతునిపాడు

హనుమంతునిపాడు మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన సానికొమ్ము వెంకటేశ్వర్లు (80) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఆయన మతదేహాన్ని టిడిపి మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, గాయం రామిరెడ్డి, కందుల వెంకటసుబ్బారెడ్డి, దొడ్డి చింతల సర్పంచి సానికొమ్ము బ్రహ్మారెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, మాలపాటి తిరుపతిరెడ్డి, సీతారాంపురం గ్రామ టిడిపి నాయకులు మల్లె బోయిన వెంకటేశ్వర్లు, కందుల యోగి రెడ్డి, రాయ వెంకటరెడ్డి, తాతిరెడ్డి తిరుపతిరెడ్డి తదితరులు సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-టంగుటూరు

పట్టు పరిశ్రమ ఏర్పాటు ద్వారా తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చునని పేస్ ఇంజినీరింగ్ కళాశాల ఇన్నోవేషన్ అంబాసిడర్ జానకిరామ్ తెలిపారు. మండల పరిధిలోనికొరుమంచి గ్రామంలో పేస్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంపు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ కల్చర్, సెరికల్చర్‌పై కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జానకిరామ్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో పట్టు పరిశ్రమ నిర్వహణ, వాటి ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. అసోసియేట్ ఆఫీసర్ మల్లికార్జునరావు పర్యావరణ విభాగం, పట్టు పరిశ్రమల నిర్వహణ వాటి పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలు విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మల్లికార్జునరావు,కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపల్ మూర్తి, స్టూడెంట్స్ డీన్ వీరాంజనేయులు, ఎ.ఎ రమణబాబు పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి కోటా శివలక్ష్మి

'ఆరోగ్య సురక్ష' వైద్యశిబిరం

ప్రజాశక్తి-దర్శి

తాళ్లూరు మండలం దోసకాయలపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచి కోట శివలక్ష్మీ వెంకటరామిరెడ్డి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీవల్లి, గ్రామస్తులు పాల్గొన్నారు. దర్శి మండలం బసిరెడ్డిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచి కేసరి రామ్‌భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు కిరణ్మయి, సుకృనాయక్, హేమంత్, సుధీర్, మౌనిక, శ్రీకాంత్‌రెడ్డి, శ్వేతలు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో తుమ్మెదలపాడు సర్పంచి శేషిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఎంపిటిసి బండి గోపాల్ పాల్గొన్నారు.

వార్షికోత్సవ వేడుకలు

సిఎస్ పురంరూరల్ : స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. తొలుత పాఠశాల ఆవరణలోని సరస్వతీ దేవి విగ్రహం వద్ద విద్యార్థులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ ప్రసాద్ రావు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కెజిబివి పాఠశాల ప్రిన్సిపల్ షేక్ రేష్మ, ఎస్ఎస్ఎ ఎఇ ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు

టంగుటూరు : టంగుటూరు పంచాయతీ పరిధిలోని అరుంధతి నగర్ వాసులు వెంకటాయ పాలెం రహదారిలో వీధిలైట్లు లేక తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు.తమ కాలనీలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు పంచాయతీ పాలకవర్గం, అధికారులకు పలుమార్లు విన్నవిం చుకున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీ సర్పంచి మద్దిరాల మమత, వార్డు సభ్యులు కామని వెంకట్రావు ఆధ్వర్యంలో అరుంధతి నగర్, వెంకటాయపాలెం దారిలో రెండు కిలోమీటర్ల పొడవునా పంచాయతీ కార్యదర్శి నర్రా జగదీష్ బాబు సూచనలతో ఎల్ఇడి వీధిలైట్లు ఏర్పాటు చేశారు. వీధిలైట్ల ఏర్పాటును పంచాయతీ సర్పంచి మద్దిరాల మమత, వార్డు సభ్యులు కామని వెంకట్రావు తదితరులు పర్యవేక్షించారు. ఎట్టకేలకు వీధిలైట్లు ఏర్పాటు చేయడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గం సభ్యులు, టిడిపి పట్టణ అధ్యక్షులు కామని నాగశ్రీను, పాల్గొన్నారు.



వీధిలైట్లను పరిశీలిస్తున్న సర్పంచి

విద్యార్థులకు మాత్రలు పంపిణీ

కొండపి : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి, వైసిపి కొండపి నియోజక ఇన్‌ఛార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. కొండపి ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా నులిపురుగుల నివారణ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాడు -నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చి దిద్దుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి మారెడ్డి అరుణావెంకటాద్రి రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ ఆరికట్ల కోటిలింగయ్య పాల్గొన్నారు.

11న జనసేన పాదయాత్ర

ప్రజాశక్తి- మద్దిపాడు

ఈనెల 11న జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సున్నా బాలసుబ్రమణ్యం కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 11న ఉదయం 8 గంటలకు లింగంగుంట గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్రను ప్రారంభించనున్నట్లు తెలిపారు. పాదయాత్ర లింగంగుంట నుంచి మారెళ్లగుంటపాలెం, నర్సాయపాలెం, అంజయ్య నగర్, పెద్ద కొత్తపల్లి, సీతారాంపురం (కోస్టాలు), మద్దిపాడు, వెల్లంపల్లి, కొలచనకోట, మల్లవరం గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్ద వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు. పాదయాత్ర సందర్భంగా గుండ్లకమ్మ పరివాహక ప్రాంతంలోని రైతులు, ప్రజా సమస్యలు, స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు దమ్ము సురేష్, ఆరేం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి తిరుమల శెట్టి చిరంజీవి, సంయుక్త కార్యదర్శి ఏడుకొండల సత్యనారాయణ, మండల సలహాదారు కమిటీ సభ్యులు నారాయణ, వంశీ కిరణ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

ఎమ్మెల్యే గొట్టిపాటి పరామర్శ

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని జాగర్లమూడి వారిపాలెంలో వివిధ కుటుంబాలను ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం కలిసి పరామర్శించారు. గ్రామంలో జాగర్లమూడి రామాంజనేయులు గుండె శస్త్రచికిత్స చేయించుకోగా ఆయనను, చెరుకూరి వెంకట్రావు కాలి శస్త్రచికిత్స చేయించుకోగా ఆయనను, మాజీ సర్పంచ్ జాగర్లమూడి వాయునందన రావు అనారోగ్యంతో బాధ పడుతుండటంతో వారిని పరామర్శించి ఆరోగ్య విషయమై వాకబు చేశారు. అద్దంకి చంద్రరావు ఇటీవల మృతి చెందగా ఆయన సభ్యులను, తెలగతోటి రమణ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. రమణ మృతిపట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు.


ఐలవరంలో పౌష్టికాహారం అందజేస్తున్న అధికారులు

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని ఐలవరం గ్రామంలో గ్రామదర్శిని కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు అంగన్‌వాడి కేంద్రాలు, పాఠశాలలు, జగనన్న కాలనీలో అవసరమైన మౌలిక వసతుల గురించి పరిశీలించారు. ఎంపీడీఓ మల్లికార్జునరావు, పంచాయతీ రాజ్, ఆర్డబ్ల్యూఎస్ డివిజన్ స్థాయి అధికారులు కేంద్రాల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, చిన్నారుల హాజరు శాతం అందజేస్తున్న పౌష్టికాహార వివరాలు అంశాలను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి సరుకు నిల్వలు, చిన్నారులకు అందజేస్తున్న వ్యాక్సిన్లు, ప్రభుత్వం నుండి మంజూరు అవుతున్న మందులు, పిల్లల ఎత్తు, బరువులు అంశాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో ప్రభుత్వం మెనూ ప్రకారం అమలు చేయాలని సూచించారు. జగనన్న కాలనీలో మౌలిక వసతుల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేస్తామని హామీలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచి మాచర్ల కోటేశ్వరరావు, ఎంపీపీ డివి లలిత కుమారి, జడ్పిటిసి ఉదయ భాస్కరి, ఉప సర్పంచ్ కర్ర జయశ్రీ పాల్గొన్నారు.


పంగులూరులో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా అధికారులు

అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని చందలూరు, కల్లంవారి పాలెం, పంగులూరు గ్రామాల్లో జిల్లా అధికారులు తనిఖీలు నిర్వహించారు. గ్రామదర్శిని కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. చందలూరు గ్రామాన్ని మార్క్ ఫెడ్ డిఎం కరుణశ్రీ, కల్లంవారి పాలెం గ్రామాన్ని ఆర్డబ్ల్యూఎస్ డిఈ ఈ శ్రీనివాసరావు, పంగులూరు గ్రామాన్ని హౌసింగ్ డిఈ ఈ వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. మూడు గ్రామాల్లోని సచివాలయాలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, వెల్నెస్ సెంటర్లు, త్రాగునీటి సరఫరా, ఎస్‌డబ్ల్యూఎస్ కేంద్రాల్లో పలు రికార్డులను, ఉద్యోగుల, విద్యార్థుల హాజరు, ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. గ్రామానికి చెందిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపాలను, గ్రామ అవసరతలను నమోదు చేసుకున్నారు.

విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- కలెక్టర్ పి రంజిత్‌బాషా
- వాడరేవులో పాఠశాలలు ఆకస్మిక తనిఖీ
- మరుగుదొడ్ల శుభ్రతపై మెమోకు అదేశం
- రైతుభరోసా, అంగన్వాడీ, సచివాలయాల పరిశీలన

ప్రజాశక్తి - చీరాల

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యుతతో పాటు కనీస వసతుల్లో ఎలాంటి లోపాలున్న నిర్వహకులపై చర్యలు తప్పవని కలెక్టర్ పి రంజిత్ భాషా హెచ్చరించారు. మండలంలోని వాడరేవులో గ్రామదర్శిని నిర్వహించారు. వాడరేవులో క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు. అంగన్‌వాడి కేంద్రం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, వైఎస్ఆర్ గ్రామీణ ఆరోగ్య కేంద్రం, రైతు భరోసా కేంద్రం, జగనన్న కాలని, సచివాలయాలను ఆయన ఆకస్మికంగా శుక్రవారం తనిఖీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహించే అధికారులు, ఇతర సిబ్బంది సామాజిక స్పృహతో పనిచేయాలని అన్నారు. అట్టడుగు వర్గాలకు సైతం ప్రభుత్వ సేవలు అందించే బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులందరిపై ఉందన్నారు. విద్యా, వైద్యం, స్థిరనివాసం, తాగునీరు వంటి అవసరాలు ప్రతి ఒక్కరికి చేరువయ్యేలా చూడాలని అన్నారు. ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. అక్కడ నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు, నిధులు లేక అర్థాంతరంగా నిలిచిన భవన నిర్మాణాలను పరిశీలించారు. 814మంది విద్యార్థులు అభ్యసిస్తుండడంపై ఆరా తీశారు. తరగతి గదులు, డిజిటల్ తరగతులు, మరుగుదొడ్లు, కంప్యూటర్


చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ భాష

శిక్షణ, నిత్యాసర సరుకుల నిల్వలను పరిశీలించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. రక్తహీనత, నులిపురుగులు నివారణతో ఆరోగ్యంగా ఉండటానికి జాగ్రత్తలను వివరించారు. చేతులు శుభ్రంగా కడుక్కోవాలని అవగాహన కల్పించారు. యూనిఫామ్, పుస్తకాలు, నోట్ బుక్స్, షఉలు పంపిణీపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటగది లేకపోవడం, ఏజెన్సీ నిర్వాహకులు బయట నుంచి తెచ్చి పెట్టడంపై అసహనం వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు శుభ్రతగా లేకపోవడంతో హెచ్‌ఎంకు మెమో ఇవ్వాలని ఎంఈఓను ఆదేశించారు. చిన్నారులకు నాణ్యమైన భోజనం తయారుచేసి వడ్డించాలని చెప్పారు. అంగన్ వాడి కేంద్రంలో ఏడాదిన్నరగా కార్యకర్త లేకపోవడంపై అసహన వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలని అన్నారు. గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, ఏఎన్ఎంలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం పక్కాగా అమలు చేయాలన్నారు. నూతన భవనాన్ని త్వరగా నిర్మించేలా పర్యవేక్షించాలని అన్నారు. ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ అందుబాటులో ఉంచాలని అన్నారు. సచివాలయం ద్వారా అన్ని సేవలు ప్రజలకు చేరాలన్నారు. కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేయకుండా సచివాలయంలో ఉంచడంపై ఆరా తీశారు. సంబంధిత విఆర్‌ఓకు ఛార్జ్ మెమో ఇవ్వాలని ఆదేశించారు. ముగ్గురు సచివాలయ సిబ్బంది సెలవులో ఉండడంపై అసహన వ్యక్తం చేశారు. సచివాలయాల సిబ్బందికి సెలవులు రద్దు చేయాలన్నారు. విధుల నిర్లిప్తతపై అసహనం వ్యక్తం చేశారు. జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా లబ్ధిదారులను చైతన్య పరచాలన్నారు. నిర్మాణం చేస్తున్న వారికి బిల్లులు ఆపకుండా తక్షణమే చెల్లించాలన్నారు. ఆయన వెంట ఆర్డిఓ సూర్యనారాయణరెడ్డి, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఎస్ విజయమ్మ పాల్గొన్నారు.

జగనన్న పాలనలో సంక్షేమం

ప్రజాశక్తి- సంతమాగులూరు

జగనన్న అక్క, చెల్లెమ్మలతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలు, ఓసీలకు కూడా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వైసీపీ ఇన్‌చార్జి పానెం చిన్న హనిమిరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వైసీపీ మండల కన్వీనర్ చింతా రామారావు అధ్యక్షతన జరిగిన ఆసరా చెక్కుల పంపిణీ సభలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ చెక్కును మహిళా సమైఖ్యకు అందజేశారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సభలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో ప్రజల ప్రయోజనార్థం అనేక సార్లు సిఎం జగన్ బటన్ నొక్కారని అన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో జగనన్న కోసం రెండుసార్లు బటన్ నొక్కాలని మహిళలను కోరారు. డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో రుణమాఫీ చేశారని అన్నారు. సచివాలయ వాలంటరీ వ్యవస్థ ఏర్పాటుతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. మాట తప్పని, మడమ తిప్పని నాయ కుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ఓటుతో ఆశీర్వదించాలని కోరారు. మండలానికి 4వ విడతగా


వైఎస్ఆర్ ఆసరా చెక్కులు పంపిణీ చేస్తున్న హనిమిరెడ్డి

రూ.11.36కోట్లు, 1147 గ్రూపులకు వచ్చాయని అన్నారు. ఇప్పటివరకు రూ.45.47కోట్లను 11260 మంది మహిళలకు లబ్ధి చేకూరిందని అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్క మహిళ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సిఎంగా మళ్లీ జగన్మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పిటిసి అడవి శ్రీనివాసరావు, ఎంపీడీఓ జి కాశయ్య, ఎపిఎం డి మస్తానరావు, ఎసి కె రవికుమార్, మండల సమైక్య అధ్యక్షురాలు లక్ష్మీ శేషు, సీసీలు వెంకయ్య, ఎఎంసి వైస్ చైర్మన్ విప్పల మునలారెడ్డి, ఓరుగంటి కోటిరెడ్డి, బొల్లినేని రామకృష్ణ, కారసాని కోటిరెడ్డి, శేషిరెడ్డి పాల్గొన్నారు.

పీవీ నరసింహారావుకు భారతరత్న గర్వకారణం

శాసనసభ్యుడు గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి - పంగులూరు

మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వడం తెలుగు వారందరికీ గర్వకారణమని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని జాగర్లమూడివారి పాలెం గ్రామంలో నాయకులు, కార్యకర్తలతో ముచ్చటించారు. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా, సిఎంగా, కేంద్రంలో హెూం, విదేశాంగ, రక్షణ శాఖల మంత్రిగా రాణించి ఆ పదవులకే వన్నె తెచ్చిన మహనీయుడిని కొనియాడారు. తన రాజనీతిజ్ఞతతో ప్రశంసలు అందుకున్నారని అన్నారు. క్లిష్ట సమయంలో బాధ్యతలు చేపట్టి ప్రధానిగా 5ఏళ్లపాటు రాణించి, ఎవరూ ఊహించని రీతిలో నిరాటంకంగా పరిపాలన కొనసాగించారని


వాయు నందనరావుని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

అన్నారు. సంస్కరణలకు ఆద్యుడిగా పీవీని పేర్కొంటారని అన్నారు. తాను సిఎంగా ఉన్నప్పుడు భూసంస్కరణ లకు శ్రీకారం చుట్టారని అన్నారు. అనుకోకుండా ప్రధాని పదవి వరిస్తే ఆ అవకాశాన్ని దేశ దశ, దిశా మార్చేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించారని అన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై పరిశీలన

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని పోలింగ్ బూతులను తహశీల్దారు సిహెచ్ సుబ్బయ్య పరిశీలించారు. మండలంలో 62పోలింగ్ బూతులు ఉన్నాయి. 32కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. విద్యుత్తు, వాటర్ సౌకర్యం, ర్యాంపులు పరిశీలించారు. సౌకర్యాలు లేని పోలింగ్ స్టేషన్లను గుర్తించారు. ఎన్నికల సమయానికి పోలింగ్ స్టేషన్లో అన్ని వసతులు కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ బి ప్రేమ్ కుమార్,


పోలింగ్‌బూత్ పరిశీలిస్తున్న తహశీల్దారు సుబ్బయ్య

సర్వేయర్ సిహెచ్ సురేష్ పాల్గొన్నారు.


జరుగుతున్న శివాలయం తొలగింపు పనులు

చరిత్ర గల శైవక్షేత్రం పునర్నిర్మాణం

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలో శతాబ్దాల చరిత్ర గల శైవ క్షేత్రమైన సోమేశ్వర స్వామి ఆలయాన్ని రూ.కోటి 10లక్షలతో పునర్నిర్మిస్తున్నట్లు బాపట్ల గ్రూపు దేవస్థాన కార్యనిర్వాహణాధికారి దివి వెంకటేశ్వర్లు తెలిపారు. 325ఏళ్ళ చరిత్ర గల దేవస్థాన సముదాయాన్ని పూర్తిస్థాయిలో తొలగించి అదే స్థానంలో నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని అన్నారు. శివాలయం పునర్నిర్మాణానికి వెచ్చిస్తున్న నిధుల్లో రూ.25లక్షల 30వేలు ప్రజలు విరాళాల ద్వారా అందజేశారని అన్నారు. ఆలయ నిర్మాణానికి ఆన్ లైన్ ద్వారా టెండర్లు ఆహ్వానించినట్లు తెలిపారు. ఈనెల 12న సీల్డు టెండర్లు పరిశీలించి అర్హులైన కాంట్రాక్టర్లకు పనులు అప్పగించనున్నట్లు తెలిపారు. ఈనెల 15న అంగరంగ వైభవంగా సోమేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ క్షేత్రం ద్వారా రూ.8లక్షలు ఆదాయం సమకూరుతుందని అన్నారు. శైవ క్షేత్ర నిర్మాణాలను పోలి ఉండే ఈ దేవాలయంలో ధ్వజస్తంభం, ఇతర మూర్తుల గదుల నిర్మాణాలు జరుగుతాయని అన్నారు.

భద్రతతోనే సురక్షిత ప్రయాణం

ప్రజాశక్తి - బాపట్ల

రహదారి భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించి, ప్రమాదరహిత ప్రయాణాలు చేయాలని మోటారు వాహన తనిఖీ అధికారి డివిబి రంగారావు సూచించారు. 35వ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో ఆటో డ్రైవర్లకు రహదారి భద్రత - ప్రమాదాల నివారణ అంశంపై అవగాహన కల్పించారు. మితవేగంతో రహదారి భద్రత నియమ నిబంధనలు పాటించాలని అన్నారు. ప్రమాదాల బారిన పడకుండా, క్షేమంగా ప్రయాణాలు చేయాలని అన్నారు. అతివేగం, వాహనాలు నడిపేటప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రమాదాల బారిన పడొద్దన్నారు. ఆటో డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రోడ్డు భద్రత వైద్యాధికారి నరేంద్ర, కార్యాలయ ఎఒ టి రాజాశేఖర్, ఆటో యూనియన్ నాయకులు బుచ్చిరాజు పాల్గొన్నారు.

నేడు 'ఆసరా' చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక రథం సెంటర్లో నేడు ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీ ప్రారంభిస్తున్నట్లు ఎపీఎం శ్రీమన్నారాయణ తెలిపారు. వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు హాజరవుతారని తెలిపారు.

ఆశా వర్కర్ల నిరసన

ప్రజాశక్తి-వెలిగండ్ల

చలో విజయవాడ నేపథ్యంలో పోలీసులు ఆశా వర్కర్లను నిర్బంధించి, ఎక్కడకక్కడ అరెస్టు చేయటం దుర్మార్గమని సిఐటియు జిల్లా నాయకుడు రాయల మాలకొండయ్య తెలిపారు. ఆశా వర్కర్ల అరెస్టును ఖండిస్తూ గురువారం రాస్తారోకో నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ మహిళలు అని కూడా చూడకుండా నిర్బంధించినట్లు తెలిపారు. ఆశ వర్కర్లపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు మల్లెల రాణి, కె. ఎస్తేరమ్మ ,లక్ష్మి, కాకర్ల ధనలక్ష్మి, బీబీ ఫాతిమా, దేవకుమారి, బాలంకమ్మ, అచ్చమ్మ ,ఈశ్వరమ్మ, అంజమ్మ, రత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.



వెలిగండ్లలో నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు



కనిగిరిలో నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు

కనిగిరి : ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ 26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పిసి. కేశవరావు డిమాండ్ చేశారు. చలో విజయవాడ వెళ్తున్న ఆశా కార్యకర్తలను అరెస్టును వ్యతిరేకిస్తూ శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు పనిభారం తగ్గించాలన్నారు. రిటైర్డ్ బెనిఫిట్స్ రూ 5 లక్షలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నరేంద్ర, యు. పిచ్చయ్య, జి.శీను, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పద్మ, సుకన్య, రమాదేవి ,అచ్చమ్మ ,సుజాత, హర్ష ,రెబ్బమ్మ ,దినాభి ,ఉష పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్ : చలో విజయవాడ సందర్భంగా ఆశా వర్కర్ల నిర్బంధాన్ని ఖండిస్తూ నిరసన తెలిపారు. తొలుత తహశీల్దారు కార్యాలయం నుంచి వైఎస్ఆర్ సర్కిల్ వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి.ఆవులయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఆశా వర్కర్లను ఎక్కడికక్కడ పోలీస్ స్టేషన్లో నిర్బంధించి భయభ్రాంతులకు గురి చేసిందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశ వర్కర్ల వేతనాలు పెంచాలన్నారు. వారిపై పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు విశ్రాంతమ్మ, రాజమణి, సరోజ, చెన్నమ్మ, సుశీల తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుడికి కారు అందజేస్తున్న మంత్రి సురేష్

కారు అందజేత

శింగరాయకొండ : శింగరాయకొండ మండలం బింగినపల్లి గ్రామానికి చెందిన పెద్దనబోయిన వెంకటేశ్వర్లుకు ఎఎంఇజి పథకం ద్వారా గురువారం కారు అందజేశారు. శింగరాయకొండ మంత్రి ఆదిమూలపు సురేష్ క్యాంపు కార్యాలయం వద్ద కారు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిరుద్యోగులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం జయరాజ్ వైస్ ఎంపిపి సామంతుల రవికుమార్ రెడ్డి , వైసిపి యువ నాయకులు మసనం వెంకట్రావు , దామ తోటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం శానంపూడి గ్రామానికి చెందిన చెందిన 45 కుటుంబాల వారు కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సమక్షంలో టిడిపిలో చేరారు. ఎమ్మెల్యే స్వామి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపిలో చేరిన వారిలో పంచాయతీ 8వ వార్డు మెంబరు రావినూతల ప్రసాద్, తగరం మోషే, రావినూతల చిన్న కొండయ్య , తగరం తిరుపాలు, గురజాల తిరుపాలు, కట్టా రాములు , గురజాల జైపాల్, సొపాటి సతీష్, మన్నే కర్ణ , మన్నే భాస్కర్, కుమార్, పొనుగోటి పవన్, పొనుగోటి నవీన్, బుర్రి సురేష్, పొనుగొట్టి లక్ష్మీనారాయణ, మన్నం లక్ష్మీనారాయణ ఉన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పొనుగోటి కొండయ్య, పులిపర్తి లక్ష్మీనారాయణ, మండలపు బ్రహ్మయ్య, తగరం మహేంద్ర, చెంచు రామయ్య, కిరణ్ రాంబాబు పాల్గొన్నారు.

టిపినగర్‌లో 10 కుటుంబాలు చేరిక..

శింగరాయకొండ మండలం సోమరాజుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని టిపి నగరకు చెందిన 10 కుటుంబాల వారు టిడిపిలో చేరారు. ఎమ్మెల్యే స్వామి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపిలో చేరిన వారిలో జగన్నాథ శివ, పాలపర్తి ప్రసాద్, పులిగోటు వినోద్ కుమార్, బల్లికురవ హరిబాబు, బొడ్డు చంద్ర ఉన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శీలం చంటి, శేఖర్, బాలకోటయ్య, వసంత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

టిడిపితోనే బీసీల అభివృద్ధి : స్వామి

ప్రజాశక్తి-పొన్నలూరు

టిడిపితోనే బీసీల అభివృద్ధి సాధ్యమవుతుందని కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. పొన్నలూరు జయహో బీసీ సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీసీలకు టిడిపి ప్రభుత్వం హయాంలో చంద్రబాబునాయుడు పెద్దపీట వేశారని గుర్తు చేశారు. సైకో ప్రభుత్వంలో బీసీలను అణచివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య మాట్లాడుతూ మన రాష్ట్రం, మన పిల్లల భవిష్యత్ బాగుండాలంటే టిడిపిని గెలిపించుకోవాలన్నారు. టిడిపి ప్రభుత్వంలో ప్రతి నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు నందికనుమ బ్రహ్మయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు కుర్రా మాల్యాద్రి, టిడిపి మండల కన్వీనర్ అనుమల సాంబశివరావు, మండవ ప్రసాద్, జి.మల్లికార్జున, మండవ మురళీ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శేషిరెడ్డికి నివాళి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

కొనకనమిట్ల గ్రామానికి చెందిన యక్కంటి శేషిరెడ్డి (80) గురువారం అనారోగ్యంతో మతి చెందారు. ఆయన మృతదేహాన్ని కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం సందర్శించి నివాళులర్పించారు. నివాళుర్పించిన వారిలో మాజీ సర్పంచి పునుగోటి కొండారెడ్డి నాయకులు రెడ్డెం తిరుపతిరెడ్డి, మండలపు శ్రీనివాసరెడ్డి తిరుపతిరెడ్డి ,పగడాల తిరుపతిరెడ్డి ఉన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

ప్రజాశక్తి-దర్శి

కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినులకు పరీక్షా సామగ్రి గురువారం అందజేశారు. దర్శికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీరు కంచర్ల బుజ్జి అందజేసిన రూ.5 వేల విలువైన సామగ్రిని ప్రిన్సిపాల్ వి.అరుణ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య రంగానికి పెద్దపీట : మంత్రి

ప్రజాశక్తి-కొండపి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వైద్య రంగానికి పెద్దపీట వేస్తున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి, వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. కొండపిలో నూతనంగా నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైద్యశాల భవనాన్ని రూ.1.35 కోట్లతో నిర్మించినట్లు తెలిపారు. వైద్యశాలలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ప్రజా ఆరోగ్యం పట్ల ముఖ్యమంత్రికి ఎంత చిత్తశుద్ధి ఉన్నదో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చునన్నారు. గ్రామీణ పేదల కోసం వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 108,104 వాహనాల గ్రామాలలోనే నైపుణ్యం కలిగిన వైద్యుల చేత వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య సేవలు ప్రజల ముంగింటకే తెచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్త్రీశిశు సంక్షేమ సంఘం ఛైర్మన్, కొండపి జడ్‌పిటిసి మారెడ్డి అరుణావెంకటాద్రిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ ఆరికట్ల కోటిలింగయ్య, నాయకులు డాకా పిచ్చిరెడ్డి, బొక్కిసం సుబ్బారావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

మహిళా సాధికారతే ధ్యేయం

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-చీమకుర్తి

మహిళా సాధికారతే ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, వైసిపి సంతనూతలపాడు నియోజక వర్గ ఇన్‌ఛార్జి మేరుగ నాగార్జున,జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపంలో వైఎస్ఆర్ ఆసరా చెక్కులు గురువారం డ్వాక్రా మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా మహిళలు నాలుగు విడతలుగా వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆసరా సంబరాల కేక్ కట్ చేశారు. అనంతరం 914 డ్వాక్రా గ్రూపులకు రూ.7,23,74, 623 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. పిఎంఇజిపి పథకం మంజూరైన కారును బండ్లమూడి చెందిన డ్వాక్రా సభ్యురాలికు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు, జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, వైసిపి మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు కె. శేఖరరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ గోపురపు రాజ్యలక్ష్మి, ఎపిఎం కోటేశ్వరరావు, విజయమ్మ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూడెల శ్రావణి, సిసిలు శ్రీను, బ్రహ్మయ్య, అజయ్, ఎంపిటిసిలు, సర్పంచులు, కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న మంత్రి నాగార్జున, బూచేపల్లి వెంకాయమ్మ

11న ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-దర్శి

హైదరాబాదులోని కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు ఫంక్షన్ హాలు ఈనెల 11న ఐటీ, నాన్ ఐటీ ఉద్యోగులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, వైసిపి దర్శి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సమ్మేళనంలో ఐటీ, నాన్ ఐటీ ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కోరారు.

రేషన్ డీలరు తొలగింపు

ప్రజాశక్తి-టంగుటూరు

మండల పరిధిలోని కందులూరు గ్రామానికి చెందిన మక్కే స్వాతి ప్రభుత్వ అనుబంధంగా ఉన్న రెండు శాఖలలో గత కొంతకాలంగా విధులు నిర్వర్తిస్తున్నారు. గత సోమవారం గ్రామస్తులు మక్కే స్వాతి వెలుగు విఓఎ,రేషన్ దుకాణం డీలర్‌గా కొనసాగుతున్నట్లు జిల్లా కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ స్థానిక అధికారులను విచారణకు ఆదేశించారు. అధికారుల విచారణలో మక్కే స్వాతి తాను విఓఎగానే కొనసాగుతానని తెలిపారు. ఈ క్రమంలో స్వాతిని గ్రామ విఓఎగా కొనసాగిస్తూ రేషన్ దుకాణం డీలర్ బాధ్యతల నుంచి తొలగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి స్థానిక అధికారులకు ఆదేశాలు అందాయి.

గిద్దలూరులో పోటీ సువర్ణావకాశమే

విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

వచ్చే ఎన్నికల్లో గిద్దలూరు నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా పోటీ చేయాలని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారని, ఇదో సువర్ణావకాశంగా భావిస్తున్నానని మార్కాపురం శాసనసభ్యులు కుందురు నాగార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం మార్కాపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కాపురం నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగుల సహకారంతో ఎంతో అభివృద్ధి చేశానని చెప్పారు. మార్కాపురంలో నిర్మించే ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరు విషయంలో ఎంతో కష్టపడ్డామని అన్నారు. వెనుకబడిన పశ్చిమ ప్రాంత ప్రజలకు ఇదో వరమని అన్నారు. ఇప్పటికే 50 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. మార్కాపురం మున్సిపాలిటీలో తాగునీటి సమస్య పరిష్కారానికి రెండో సాగర్ లైన్ తీసుకువచ్చినట్లు తెలిపారు. పొదిలి పెద్ద చెరువు నుంచి తాగునీటి ప్రాజెక్టును తీసుకువచ్చినట్లు తెలిపారు. మార్కాపురంలో షాదీఖానా, బిసి భవన్, అంబేద్కర్ భవన్‌లు సాధించుకున్నట్లు తెలిపారు. మార్కాపురం పట్టణంలో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మించామన్నారు. పొదిలిలో, కొనకనమిట్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నిర్మించినట్లు చెప్పారు. మార్కాపురం చెన్నకేశవస్వామి దేవాలయం అభివృద్ధికి దాతల సహకారంతో రూ.13 కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. ఇందులో రూ.3 కోట్లు దేవదాయ శాఖ మంజూరు చేసిందన్నారు. పొదిలిలో 300 కుటుంబాలను బిసి ఇ కింద గుర్తించేలా చర్యలు తీసుకున్నామన్నారు. నియోజకవర్గంలో మూడు విద్యుత్ సబ్ స్టేషన్‌లు మంజూరు చేయించినట్లు తెలిపారు. తాను ఏడాదిలో 365 రోజులు ప్రజా సేవలో కొనసాగినట్లు చెప్పారు. ఈ ప్రాంత సస్యశ్యామలం కోసం నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ఆర్ భూమిపూజతో వెలిగొండ ప్రాజెక్టు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రస్తుతం రెండు సొరంగాలను సిఎం జగన్ పూర్తి చేశారన్నారు. వెలిగొండ ప్రాజెక్టులో సొరంగాల నిర్మాణమే కీలకమన్నారు. మా నాన్న కెపి కొండారెడ్డిని మూడుసార్లు సమితి అధ్యక్షులుగా, నాలుగు దఫాలుగా ఎమ్మెల్యేగా ఆదరించారన్నారు. తన మామ ఉడుముల శ్రీనివాసరెడ్డిని ఎమ్మెల్యేగా ఆదరించారన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటామన్నారు. గిద్దలూరులోనూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్‌అలీబేగ్, మాజీ ఎఎంసి ఛైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్‌లు షేక్ ఇస్మాయిల్, సిహెచ్ అంజమ్మ శ్రీనివాస్, ఎంపిపి పొరెడ్డి అరుణా చెంచిరెడ్డి, జడ్‌పిటిసి నారు బాపన్‌రెడ్డి, తర్లుపాడు మండల వైసిపి నాయకులు సూరెడ్డి రామసుబ్బారెడ్డి, మురారి వెంకటేశ్వర్లు, పొదిలి పట్టణ వైసిపి కన్వీనర్ నూర్జహాన్‌బేగం, వైసిపి నాయకులు పత్తి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి


సభా ప్రాంగణ స్థలాలను పరిశీలిస్తున్న జనసేన ఇన్‌ఛార్జి బెల్లంకొండ

హెలీప్యాడ్‌కు స్థల పరిశీలన

ప్రజాశక్తి-గిద్దలూరు

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ త్వరలో గిద్దలూరు నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ నాయకులు వెల్లడించారు. సభా ప్రాంగణం కోసం జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బెల్లంకొండ సాయిబాబు గిద్దలూరులోని పలుచోట్ల పరిశీలించారు. ఎన్నికల సమయంలో పవన్ కళ్యాణ్ గిద్దలూరులో పర్యటించనుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. పొత్తులో భాగంగా గిద్దలూరు టికెట్ జనసేనకు కేటాయించనున్నారనే ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గంలో కాపు ఓటర్లు అత్యధికంగా ఉన్నారు. 2004లో కాపు నేత పగడాల రామయ్య విజయం సాధించారు. 2009లో ప్రస్తుత ఎమ్మెల్యే అన్నా రాంబాబు పిఆర్‌పి నుంచి గెలుపొందారు. ఈ కారణాలతో ఇక్కడ జనసేనతో పోటీ చేయించడం కోసమే నియోజకవర్గానికి పవన్ కళ్యాణ్ వస్తున్నారని జనసేన సోషల్ మీడియా గ్రూప్‌లలో చర్చ నడుస్తోంది.


చెంచులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న అశోక్‌రెడ్డి

టీడీపీలోకి 15 చెంచు కుటుంబాలు

ప్రజాశక్తి-గిద్దలూరు

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో అర్ధవీడు మండలం, గన్నేపల్లె పంచాయతీలోని చెంచు కాలనీకి చెందిన 15 చెంచు కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీలో చేరిన చెంచు కుటుంబాలకు చెందిన కుడుముల వెంకటేశ్వర్లు, మండ్ల బైరెడ్డి, చిన్న గురవయ్య, భయ్యన్న, గురవయ్య, పెద్దన్న తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి-సంతనూతలపాడు: ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలంతా ఉపయోగించుకోవాలని జడ్పిటిసి దుంపా రమణమ్మ కోరారు. స్థానిక జడ్పీ హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ఫేస్-2ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ వైద్య శిబిరంలో 256 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరంలో డాక్టర్ పి హరిణి, డాక్టర్ చైతన్యస్రవంతి, డాక్టర్ శశికాంత్, డాక్టర్ సంధ్యామాధవి, డాక్టర్ నాగరాజు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దర్శి నాగమణి, ఎంపీపీ విజయ, గ్రామ కార్యదర్శి ఎన్ ప్రతాప్ కుమార్, ఏఎన్ఎం కృష్ణవేణి, ఎల్‌టి వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే ప్రత్యేక హోదా సాధ్యం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

కాంగ్రెస్ పార్టీతోనే ప్రత్యేక హోదా సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలపర్తి డేవిడ్‌రాజు అన్నారు. శుక్రవారం పెద్దదోర్నాల పట్టణంలో 'మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి' అనే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు పాలపర్తి విజేష్‌రాజు, జిల్లా నాయకులు బాలకృష్ణారెడ్డి, గని, మౌలాలి, ప్రవీణ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టిడిపి ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

పుల్లలచెరువులో 'జయహో బీసీ'

ప్రజాశక్తి-పుల్లలచెరువు

సామాన్య కార్యకర్తనైన నేను నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ నియోజకవర్గానికి సేవ చేసేందుకు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా వచ్చాను. ఆశీర్వదించండి. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. శుక్రవారం పుల్లలచెరువు మండల కేంద్రంలో జయహో బీసీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తొలుత ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులు, బీసీ వర్గాల నుంచి పుట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని ఆయన అన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో గతంలో మూడుసార్లు జరిగిన ఎన్నికల్లో టిడిపి గెలుపొందలేకపోయిందన్నారు. ఈసారి టిడిపి నాయకులు, జనసేన నాయకులు అందరూ కలిసి గెలిపించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ పయ్యావుల ప్రసాదు, నాయకులు కాకర్ల కోటయ్య, పొట్ల గోవిందు, మాజీ సర్పంచ్ వేముల కృష్ణయ్య, గజ్జవల్లి భాస్కరరావు, ఎల్లయ్య, ఇదెమ్మ, జనసేన మండల కన్వీనర్ కటారి కృష్ణ, ఆర్మీ బుజ్జి, నక్క ఏడుకొండలు పాల్గొన్నారు.

సిఐ రాములు నాయక్‌కు సన్మానం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం సీఐ రాములు నాయక్, ఎస్ఐ సుదర్శన్‌లను శుక్రవారం గిరిజన నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ ప్రాంత గిరిజన సమస్యలను వారికి వివరించారు. గిరిజనులకు అండగా ఉండాలని కోరారు. శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులు, సుద్దకురవ తండా సర్పంచ్ బి వెంకటేశ్వర్లు నాయక్, పుల్లలచెరువు జడ్పిటిసి వాగ్యానాయక్, వైసీపీ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు రాములు నాయక్, పీఆర్సీ తండా సర్పంచ్ బద్దు నాయక్ తదితరులు పాల్గొన్నారు.


సిఐ రాములు నాయక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ముత్తుములను కలిసిన నాయీ బ్రాహ్మణులు

ప్రజాశక్తి-గిద్దలూరు

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డిని గిద్దలూరు నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి చేతుల మీదుగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సాధికార సమితి కరపత్రాలను ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు తొండమల్ల బ్రహ్మయ్య, నాయీబ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్లు పసుపుల శివరాం ప్రసాద్, రావిపాటి నాగరాజు మరియు కొకటం ప్రసాద్, బోగోలు నారాయణ తదితరులు పాల్గొన్నారు.


నాయీబ్రాహ్మణ సాధికార సమితి కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ముత్తుముల అశోక్‌రెడ్డి

'చిరుధాన్యాలతో వంద రకాల వంటలు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

'చిరుధాన్యాలతో వంద రకాల వంటలు' పుస్తకాన్ని ఎంపీపీ విజయ, జడ్పిటిసి దుంపా రమణమ్మ, గ్రామ సర్పంచ్ దర్శి నాగమణి, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు బి నరసింహారావు, వైసీపీ మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి ఆవిష్కరించారు. స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం సందర్భంగా ముందుగా ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ వ్యవసాయ సహాయకులు ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండి వారికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ విస్తరణ అధికారి సుబ్బారెడ్డి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పలువురు రైతులు పాల్గొన్నారు.

'ఈ-మిర్చి 2.0' ప్రాజెక్టుపై అవగాహన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో యర్రగొండపాలెంలోని వైఎస్ఆర్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో ఉద్యాన శాఖ, డిజిటల్ గ్రీన్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టబోయే ఈ-మిర్చి 2.0 అనే ప్రాజెక్ట్ గురించి శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దదోర్నాల మండలాల్లో రైతు భరోసా కేంద్రాలలో పనిచేసే గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు అధికారి పివి రమణ, జిల్లా ఉద్యాన అధికారి వై గోపీచంద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ గ్రీన్ సంస్థ మేనేజర్ కమలాకర్, వ్యవసాయ శాఖ ఏడిఏ నీరజ, ఉద్యాన శాఖ అధికారి పి ఆదిరెడ్డి, దోర్నాల మండల వ్యవసాయ అధికారి జవహర్ నాయక్, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు అధికారి రమణ

గిద్దలూరు రూరల్: గిద్దలూరు సబ్ డివిజన్ పరిధి గిద్దలూరు, కొమరోలు, రాచర్ల, బేస్తవారిపేట మండలాల ఆర్‌బికే సిబ్బందికి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి గోపీచంద్ ఆధ్వర్యంలో గిద్దలూరు ఎంపీడీవో కార్యాలయంలో ఈ-మిర్చి 2.0 ప్రాజెక్ట్ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. డిజిటల్ గ్రీన్ డిస్ట్రిక్ కోఆర్డినేటర్ కమలాకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో, ఉద్యానశాఖ అధికారి విష్ణుప్రియ, గిద్దలూరు, రాచర్ల వ్యవసాయ శాఖ అధికారులు భాస్కర్ రెడ్డి, రఫీక్, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో విష జ్వరాలు

ప్రజాశక్తి-పొదిలి: పొదిలి మండలం పోతవరం ఎస్సీ కాలనీలో విష జ్వరాలు ప్రబలాయి. దీంతో చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. శానిటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న మండల బీసీ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ పులిగర్ల శ్రీనివాస్ యాదవ్ పాల్గొని విష జ్వరాలు ప్రబలుతున్న సందర్భంగా పంచాయతీ సిబ్బందితో పారిశుధ్య పనులు దగ్గరుండి చేయిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

జగనన్న కాలనీ గృహ నిర్మాణ లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో ఎం శ్రీహరి కోరారు. శుక్రవారం సంతనూతలపాడులోని జగనన్న కాలనీలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో ఆయన సమావేశమయ్యారు. వివిధ స్థాయిలో ఉన్న గృహ నిర్మాణాలను వేగవంతంచేసి అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్, డిఎల్‌డివో ఉషారాణి గ్రామ సర్పంచ్ దర్శి నాగమణి, ఎంపీపీ బి విజయ, జడ్పిటిసి దుంపా రమణమ్మ, హౌసింగ్ ఏఈఎం వెంకటస్వామి గ్రామపంచాయతీ కార్యదర్శి ఎన్ ప్రతాప్ కుమార్, వెలుగు సిసి లక్ష్మి, వివోఏలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీహరి



అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న ఆర్‌డిఒ

ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - రేపల్లె

మండలంలోని బేతపూడి గ్రామంలో సచివాలయాన్ని, ఎంపీపీ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలను ఆర్డీఓ హేలా షారోన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్ వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందిస్తున్న పోషకాహారం పాలు, గుడ్లను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం ఏర్పాటు చేయాలని సూచించారు. ఐదేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించి కేంద్రాలను బలోపితం చేయాలని కోరారు. అనంతరం బేతపూడి సచివాలయం సందర్శించారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లలో భాగంగా మంజూరైన ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులకు సర్వహక్కులు కలిగేలా రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యుత్ మోటారు చోరీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పల్లికోన గ్రామానికి చెందిన బియు అనే వ్యక్తి పొలంలోని విద్యుత్ మోటారును గుర్తు తెలియని దుండగులు దొంగిలించారు. విద్యుత్ మోటారు మురుగు కాలువ అంచున ఒక షెడ్డులో నిర్మించాడు. దాని ద్వారా 15 నుండి 20 ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మొక్కజొన్న ఇదే మోటారుతో సాగు చేపట్టాల్సి ఉందని, అర్ధాంతరంగా దుండగులు టెక్మో కంపెనీకి చెందిన 5హెచ్‌పి మోటారును అపహరించడం గ్రామంలో రైతులను కలవరానికి గురిచేస్తుంది. గతంలో ఇదే రీతిలో వివిధ గ్రామాల్లో అనేక విద్యుత్ మోటార్లను దొంగలు అపహరించిన ఘటన కూడా ఉన్నాయి. దీనిపై పోలీసులు దృష్టి సారించి ఇందుకు కారకులైన వారిని అదుపులోకి తీసుకోవాలని కోరారు.ు

'ఆదివాసీ మేనిఫెస్టో' ఆవిష్కరణ

ప్రజాశక్తి - అద్దంకి

ఎన్నికల మేనిఫెస్టో వచ్చే ఐదేళ్లలో ప్రజల భవిష్యత్తుతోపాటు రాష్ట్రాన్ని, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు రాజకీయ పార్టీలు ఇచ్చే భరోసా, ఎన్నికల మేనిఫెస్టోలు దేశ ప్రజాస్వామ్య లక్ష్యాలను సాధించుటలో ప్రధాన పాత్ర పోషిస్తాయని వైసిపి ఇన్‌ఛార్జి పాణెం చిన్న హనీమిరెడ్డి అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక వైసిపి కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ దళిత - ఆదివాసి మేనిఫెస్టో పుస్తకం, సావనీర్‌ను ఆవిష్కరించారు. డిబిఆర్‌సి రీజనల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, పులిపాటి వీరయ్య, వైసిపి నాయకులు కొంద్రు వెంకట సుబ్బారావు, రావినూతల నాయకులు గాలి సుబ్బారావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆదేశిక సూత్రాలకు అనుగుణంగా ప్రజల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ప్రాథమిక హక్కులు కాపాడేలా రాజకీయ పార్టీల మేనిఫెస్టో రూపకల్పన చేయాలని కోరారు.

వేరుశనగలో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

వేరు శనగ పంటలో జిప్సం వేయడం ద్వారా దిగుబడులు పెరగడంతో పాటు నాణ్యమైన పంట పొందవచ్చునని ఎఒ టి బాలాజీ గంగాధర్ తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వేరుశనగ పంటను ఆయన శుక్రవారం పరిశీలించారు. వేరుశనగ విత్తనాలు నాటిన 20రోజుల్లోపు గడ్డి జాతి కలుపు మొక్కల ఉధృతి అధికంగా ఉన్నట్లయితే ఎకరాకు 400 మిల్లీలీటర్ల క్విజలోఫాఫ్ ద్రావకాన్ని 200లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. గడ్డి జాతి కలుపు మొక్కలతో పాటు వెడల్పాటి కలుపు మొక్కలు అధికంగా ఉన్నట్లయితే ఇమజితాపీరు 10శాతం ద్రవకాన్ని 300మిల్లీలీటర్లు 200లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. పంట విత్తిన 40నుండి 50రోజులు మధ్యలో 200కేజీల జిప్సంను భూమిలో వేసినట్లయితే అధిక దిగుబడి, నాణ్యమైన విత్తనాలు పెరిగి బరువు అధికంగా ఉంటుందని తెలిపారు.

పండుగలా సంక్షేమ కార్యక్రమాలు

ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

ప్రజాశక్తి - వేటపాలెం

రాష్ట్రంలో సంక్షేమ పథకాలు పండుగలా నిర్వహించిన ఘనత సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 4వ విడత ఆసరా సంబరాలు శుక్రవారం నిర్వహించారు. మండలంలోని 1335 స్వయం సహాయక సంఘాలకు రూ.8.35కోట్లు జమ చేసినట్లు తెలిపారు. పేదల పక్షపాతి జగనన్నని రాబోవు ఎన్నికల్లో మరల ముఖ్యమంత్రిగా చేసుకోవాలని వైసిపి ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ బాబు అన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర గవిని శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు బొడ్డు సుబ్బారావు, జెసిఎస్ మండల ఇంచార్జ్ లేళ్ల శ్రీధర్, రామన్నపేట సర్పంచ్ కందేటి రమణ, ఉపసర్పంచ్ దంతం వెంకట సుబ్బారావు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు పులి వెంకటేశ్వర్లు, నల్లబోతుల రాజ్ కుమార్, ఆర్‌బికె చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ చల్లా జనార్దనరావు, కట్టా



ఆసరా చెక్కు అందజేస్తున్న బలరాం, వెంకటేష్

గంగయ్య, జంగిలి రామారావు, అందే కృష్ణ, మహిళా అధ్యక్షురాలు మద్దులూరి సీతా మహాలక్ష్మి, ఆవుల అశోక్, ఆవుల కొండలు, బండికళ్ళ నరేష్, జిడుగు మస్తాన్, షేక్ ఖాదర్, అందే రాజేష్, బుర్ల శివ, పృధ్వి చంద్రమోహన్, సజ్జ చంద్ర, సాధు రాఘవ, దంతం హనుమంతు, నర్మదా, వేటగిరి సంజీవరావు, కర్ణ లక్షరావు, బుద్ధిరవి, మధుర రవి, షేక్ కజ్జి, భోగిరెడ్డి నాగరాజురెడ్డి, పులి శ్రీనివాసరావు, కె విజయ్, కర్ర వెంకటేశ్వర్లు, వాయిల రమేష్, పులి సోమయ్య, శ్రీరామ్ మూర్తి, నంగురామిరెడ్డి, ఎపీఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధే వైసిపి ధ్యేయం

ప్రజాశక్తి- కారంచేడు

రాష్ట్రంలో మహిళల అభ్యున్నతే వైసిపి ధ్యేయమని వైసిపి ఇంచార్జి ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. స్థానిక రామానాయుడు కల్యాణ మండపంలో డ్వాక్రా మహిళలకు వైఎస్ఆర్ ఆసరా చెక్కులు శుక్రవారం పంపిణీ చేశారు. సభకు ఎంపీపీ నీరుకట్టు వాసు బాబు అధ్యక్షత వహించారు. సభలో కృష్ణమోహన్ మాట్లాడుతూ 865 డ్వాక్రా గ్రూపులకు రూ.7.64కోట్లు ఆసరా ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు. మహిళల అభివృద్ధికి ఉపయోగించుకోవాలని అన్నారు. నియోజకవర్గంలో రూ.23 కోట్ల 39 లక్షలు మహిళలకు లబ్ధి చేకూరిందని చెప్పారు. డ్వాక్రా మహిళలు సిఎం జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎంపీడీఒ పి బాబురావు, డిఎల్పిఒ



చెక్కు అందజేస్తున్న ఆమంచి కృష్ణమోహన్

శివశంకరరావు, ఎపీఎం మధుసూదనరావు, తహశీల్దారు మెహర్ బాబు, యార్లగడ్డ శ్రీకాంత్ బాబు. దండ చౌదరిబాబు, కొడాలి మోహనకృష్ణ, కొంద్రపాటి అనిల్, ముల్లా నుర్‌అహ్మద్, గుమ్మడి రామ్మోహనరావు, యార్లగడ్డ పాపారావు, నాదెండ్ల నాగరాజు, బాబురావు పాల్గొన్నారు.

గ్రామదర్శినిలో అధికారుల పరిశీలన

ప్రజాశక్తి - వేటపాలెం

కలెక్టర్ రంజిత్ భాష ఆదేశాల మేరకు మండలంలోని దేశాయిపేట, వేటపాలెం గ్రామాల్లో శుక్రవారం గ్రామదర్శిని నిర్వహించారు. వేటపాలెంలో ఆర్డీఒ సూర్యనారాయణరెడ్డి సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్, వెటర్నరీ హాస్పిటల్, జెడ్‌పి హై స్కూల్‌ను పరిశీలించారు. అక్కడ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. దేశాయిపేటలో జిల్లా హౌసింగ్ పిడి జెవికె ప్రసాద్ హై స్కూల్, దేశాయిపేట సచివాలయం, హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. జెడ్‌పి హై స్కూల్ ఊసలు ఊడిపోయి ఉండటాన్ని గమనించారు. తక్షణమే టాపు బిగించాలని ఆదేశించారు. కార్యక్రమాలలో వేటపాలెం పంచాయతీ కార్యదర్శి ఎస్ రాజశేఖరరెడ్డి, ఇన్చార్జి తహశీల్దారు ప్రసన్నలక్ష్మి,



పాఠశాల్లో పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సూర్యనారాయణరెడ్డి

దేశాయిపేట పంచాయితీ కార్యదర్శి ఎం శ్రీనివాసరావు, హౌసింగ్ ఎఈ సుబ్బారావు పాల్గొన్నారు.

వేటపాలెం : పాపాయపాలెం పంచాయతీలో శుక్రవారం జరగాల్సి ఉంది. జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ హనుమంతరావుకి బిజీ షెడ్యూల్ కారణంగా హాజరు కాలేకపోయినట్లు ప్రజాశక్తికి తెలిపారు.

జగన్ పాలనలో దళితుల సంక్షేమం శూన్యం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక బాలసౌరి కాలనీలో టిడిపి ఆధ్వర్యంలో పోరుబాట నిర్వహించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వ పాలనలో దళితుల అభ్యున్నతి, అవసరాలను దృష్టిలో ఉంచుకొని అద్దేపల్లిలో అంబేద్కర్ భవన్ నిర్మాణానికి రూ.50లక్షలు, బాలశౌర్య నగర్ కాలనీలో జగ్జీవన్ రామ్ భవన్ నిర్మాణానికి రూ.30లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్మాణాత్మకంగా జీఒ జారీ చేసిన ఈ నిధులతో ఏ ప్రభుత్వం అందుబాటులో ఉన్నప్పటికీ కేటాయించిన పనులను జరిపించుకునే వ్యసులుబాటు ఉందని అన్నారు. కానీ నేటి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మెరుగు నాగార్జున దళితులను విస్మరించాడని అన్నారు. నిధులు మురిగి పోయే విధంగా వ్యవహరించారని ఆరోపించారు. టిడిపి కాలంలో మంత్రిగా ఉన్న నక్కా ఆనందబాబు ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టారని అన్నారు. ప్రస్తుత పాలనలో ఆ ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇదే బాల సౌరి కాలనీలో



పోరు బాటలో స్థలాన్ని చూపుతున్న సాయిబాబా

తెలుగుదేశ ప్రభుత్వ పాలనలో నివేషణ స్థలాలు కొనుగోలు చేసి పట్టాలు అందజేసి గృహ నిర్మాణాలు కల్పించినట్లు తెలిపారు. 20మీటర్ల రహదారి నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం వద్దన నిధులు లేవా? అని ప్రశ్నించారు. పంచాయతీలో నిధులు లేవాని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ పాలన తీరుకు నేటి ప్రభుత్వ పాలన పరిస్థితిని ప్రజలకు వివరించేందుకే పోరుబాట చేపట్టామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వై కరుణ శ్రీనివాసరావు, ఎడ్ల జయశీలరావు, సిరాజుద్దీన్, బట్టు మల్లికార్జునరావు, కనపర్తి సుందర్రావు, గొట్టుముక్కల లెనిన్ పాల్గొన్నారు.



ఆరోగ్య సురక్ష కిట్లు అందజేస్తున్న ఎంపీపీ లలిత కుమారి

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని ఐలవరం సచివాలయం-1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత వైద్యశిభిరం శుక్రవారం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు ప్రారంభించారు. శిభిరంలో ఎంపీపీ డివి లలిత కుమారి అధ్యక్షతన వైద్యులు పద్మజ, శ్రీనివాసరావుతోపాటు మరో ముగ్గురు స్పెషలిస్టు వైద్యులచే రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 300మందికిపైగా పరీక్షలు నిర్వహించి మందులతో పాటు కిట్లను పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ వైద్యశిభిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పిటిసి టి ఉదయ్ భాస్కరి, ఉప సర్పంచ్ జయ శ్రీ, ఎంపీడీఒ మల్లికార్జునరావు, నాయకులు మల్లేశ్వరరావు, బాలాజీ, హేమ సుందరావు పాల్గొన్నారు.

పంటల సాగును నమోదు చేయాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

రైతులు రబీలో సాగు చేసిన వివిధ రకాల పంటలను తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని ఎఒ గొల్లపోతు మీరయ్య సూచించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఎంపీపీ డివి లలిత కుమారి అధ్యక్షత వహించారు. వీరయ్య మాట్లాడుతూ ఈక్రాపు నమోదుతో రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి ఉదయభాస్కరి, వ్యవసాయ సలహా మండలి కమిటీ చైర్మన్ కుందేటి రమేష్, విఎఎ పాల్గొన్నారు.

వేటపాలెం : మొక్కజొన్న, వేరుశనగ పంటల సమగ్ర యాజమాన్య సస్యరక్షణపై రెండు రోజుల అవగాహన సదస్సు మండలంలోని కొత్తపేట ఆర్‌బికె నిర్వహించారు. విజయవాడ సమగ్ర సస్యరక్షణ కేంద్రం సహాయ సంచాలకులు వీరబాబు, ఎఒలు సురేష్, దక్షిణామూర్తి సమగ్ర యాజమాన్య పద్ధతులు, పురుగుల నివారణ, విత్తన శుద్ధి, కలుపు మొక్కలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. డాట్ సెంటర్ కోఆర్డినేటర్ ఓబయ్య, పురుగుల శాస్త్రవేత్త సురేఖ, ఎఒ ఐ కాశీ విశ్వనాథ్, కొత్తపేట, పాపాయిపాలెం, అక్కయ్యపాలెం, వేటపాలెం, పందిళ్ళపల్లి గ్రామాల రైతులు, విహెచ్‌ఎలు, విఎఎలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు బీమా సౌకర్యం

ప్రజాశక్తి- సంతమాగులూరు

స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోగల 134 అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు రాష్ట్ర మహిళాభివృద్ధి అండ్ శిశు సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు సిడిపిఓ డి సుధ తెలిపారు. 50ఏళ్లలోపు వయసున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా పథకం ద్వారా ఏడాదికి రు.436, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద అందరికీ రూ.20చొప్పున ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. రూ.2లక్షల వరకు టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్, పిఎం ఎస్‌బివై ద్వారా రూ.లక్షల వరకు ప్రమాదవశాత్తు మరణం, అంగ వైకల్యం ఏర్పడితే బీమా సౌకర్యం కలుగుతుందని అన్నారు. ఈ రెండు పథకాలు ప్రతి సంవత్సరం జూన్ 1నుండి మే 31వరకు ప్రతి ఏడాది రెన్యువల్ చేయించుకోవాలని అన్నారు.

నులిపురుగుల నివారణే ధ్యేయం

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

నులిపురుగుల నివారణే ధ్యేయంగా పని చేస్తున్నామని మలేరియా అధికారి రాజ్‌కుమార్ అన్నారు. ఇంకొల్లు, ఇడుపులపాడు గ్రామాల్లో ఏడాది నుండి 19ఏళ్లలోపు పిల్లలకు మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారి టి అంజలి, హరేరామకృష్ణ, భాను ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

బియ్యం వివరాలు

పోర్టల్‌లో నమోదు చేయాలి

వ్యాపారులు, మిల్లర్లకు డిఎస్‌ఒ ఉదయభాస్కర్ ఆదేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని వ్యాపారులు, హెూల్ సేల్, రిటైలర్స్, మిల్లర్లు వారి వద్ద ఉన్న బియ్యం/ ధాన్యం నిల్వలను సంబంధిత పోర్టల్‌లో వారం రోజులలో నమోదు చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి ఏ.ఉదయ భాస్కర్ స్పష్టం చేశారు. స్థానిక డిఎస్‌ఒ కార్యాలయంలో జిల్లాలోని వ్యాపారులు, హెూల్‌సేల్, రిటైలర్స్, మిల్లర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌ఒ మాట్లడుతూ కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన మేరకు జిల్లాలో ఉన్న ధాన్యం, బియ్యం స్టాక్ వివరాలు నిర్దేశిత పోర్టల్‌లో వారం లోపు నమోదు చేయలన్నారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం ధాన్యం బియ్యం వివరాలూ నమోదు చేయడంతో పాటు ఇకపై ప్రతి శుక్రవారం నిరంతరం



మాట్లాడుతున్న డిఎస్‌ఒ ఉదయభాస్కర్

కొనసాగించాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలపై అవగాహన కల్పించడం ద్వారా బియ్యం వ్యాపారానికి సంబంధించిన అమ్మకం, నిల్వ వంటి అంశాలపై రైస్ మిల్లర్లలకు అవగాహన కల్పించటానికి సమావేశం నిర్వహించామన్నారు. సమావేశంలో సహాయ పౌర సరఫరాల అధికారి పి.పుల్లయ్య బియ్యం అమ్మకందార్లు, రైస్ మిల్లర్లు , బియ్యం వ్యాపారులు, పౌర సరఫరాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సౌర విద్యుత్ ఉత్పత్తి పెంపుపై మాగుంట ప్రశ్న

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

దేశ రైతాంగం కొరకు కేంద్రం అమలు చేస్తున్న పిఎం కుసుమ్ పథకం లక్ష్యాలు, రాష్ట్రాల వారీగా సాధించిన పురోగతిపై ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర కొత్త పునరుత్పాదక శక్తి, విద్యుత్ శాఖ మంత్రి ఆర్‌కె సింగ్ సమాధానమిస్తూ దేశ రైతాంగానికి సరసమైన, అందుబాటులో విద్యుత్‌ను అందించటం, నీటి భద్రతను కల్పించటం, వారి ఆదాయాన్ని పెంచటం, పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించుటకు రూ.34,422 కోట్ల కేంద్ర మద్దతుతో 4,422 మెగా వాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పిఎం కుసుమ్ పథకాన్ని కేంద్రం 2019 మార్చిలో ప్రారంభించిందన్నారు. తరువాత 2023 సెప్టెంబర్ లో విస్తరించబడిందని తెలిపారు. సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు రైతు, రైతులు, సౌర విద్యుత్ విస్తరణ దారులు, సహకార సంస్థలు, గ్రామ పంచాయితీలు మరియు రైతు ఉత్పత్తి సంస్థలు అర్హులని కేంద్ర మంత్రి తెలియజేశారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న న్యాయమూర్తి

వెట్టిచాకిరీని నిర్మూలించాలి

సీనియర్ సివిల్ జడ్జి కె.శ్యాంబాబు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వెట్టిచాకిరీ దేశంలో ఎంతో కాలంగా ఉన్న ఒక సామాజిక వెనుకబాటుతనమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.శ్యాంబాబు తెలిపారు. ఈనెల 9వ తేదీ వెట్టి చాకిరి నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా శ్యాంబాబు మాట్లాడుతూ దేశంలో బాండెడ్ లేబర్ అబాల్షన్ సిస్టం చట్టాన్ని ఫిబ్రవరి 9వ తేదీ 1976 ఫిబ్రవరి 9న ఆమోదించారన్నారు. వెట్టి చాకిరి వ్యవస్థ కార్మిక సంబంధమైన నేరం మాత్రమే కాదని ఇదొక తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన నేరమని తెలియజేశారు. 1976 నాటి వెట్టిచాకిరి నిర్మూలన చట్టం ద్వారా ప్రభుత్వం ఈ విధమైన బానిసత్వానికి గురి చేయడాన్ని నేరంగా పరిగణిస్తుందన్నారు. వెట్టి చాకిరీ నిర్మూలనకు అందరం కృషి చేద్దామని హాజరైన సభ్యులందరితో న్యాయమూర్తి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ప్రతినిధులు, సార్డ్స్ సంస్థ ప్రతినిధులు సుమన్, శ్రీనివాసరావు, బాలకాశమ్మ, ప్రియాంక పాల్గొన్నారు.

చదువుతో పాటు

ఆరోగ్యంపైనా దృష్టి పెట్టండి

విద్యార్థులకు సూచించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపైనా శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ సూచించారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఆయన తెలిపారు. 'జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం' సందర్భంగా శుక్రవారం ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయంలోని పిల్లలకు అల్బెండ జోల్ మాత్రల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేతిగోళ్లను చిన్నగా, శుభ్రంగా ఉంచుకోవడం, ఎప్పుడూ శుభ్రమైన నీటిని తాగడం, కూరగాయలు, పళ్లను శుభ్రమైన నీటితో కడగడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం చిన్నప్పటినుంచే అలవాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టర్, మేయర్ స్వయంగా విద్యార్థులతో మాత్రలు మింగించారు. కార్యక్రమంలో ఇన్చార్జి డిఎం,హెచ్ డాక్టర్ డి. సురేష్ కుమార్, డిఐఒ పద్మజ, డిఈఒ డి. సుభద్ర, నోడల్ ఆఫీసర్ భగీరథీ దేవి, డిపిఎం వాణిశ్రీ, ప్రిన్సిపాల్ రామి రెడ్డి, సిడిపిఒ రాజకుమారి, స్థానిక కార్పొరేటర్ ఆదిపూడి శాండిల్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొండవీడు ఫెస్ట్‌ను ఆస్వాదించండి

చారిత్రక విశేషాలను వీక్షించడంతోపాటు సాహస కత్యాలకు అవకాశం కల్పించేలా నిర్వహిస్తున్న 'కొండవీడు ఫెస్ట్ 2024' ను ఆస్వాదించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సూచించారు. పల్నాడు జిల్లా కొండవీడు కోటపై ఈ నెల 10,11 తేదీలలో జరిగే కొండవీడు ఫెస్ట్‌కు సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. హెలీ రైడ్, పారామోటరింగ్, హాట్‌ఎయిర్ బెలూన్, రాక్ క్లైంబింగ్, కయాకింగ్ బోటింగ్, హార్స్ రైడింగ్, సైకత శిల్ప ప్రదర్శన, డాన్స్ పోటీలు, చిల్డ్రన్ ప్లే ఎగ్జిబిషన్, ఫ్లవర్ షో, చారిత్రక ఫోటో ఎగ్జిబిషన్, ఫుడ్ ఫెస్ట్ ఉంటాయని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 86886 28881 , 9885474340 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

పవన్‌కల్యాణ్‌కు కలిసిన మలగా రమేష్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్



పవన్‌తో మలగా రమేష్, రియాజ్

జనసేన పార్టీ ఒంగోలు నగర అధ్యక్షులు, 38వ డివిజన్ కార్పొరేటర్ మలగా రమేష్ ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌ను కలిశారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో జరిగిన సంతనూతలపాడు నియోజకవర్గానికి సంబంధించి పార్టీ ఇన్సూరెన్స్ చెక్కులు పంపిణీ కార్యక్రమంలో భాగంగా పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, పార్టీ సీనియర్ నాయకులు బాబు, మలగా రమేష్ పవన్‌ను కలిసి.. మాట్లాడారు. ఈ సందర్భంగా రమేష్‌తో పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే వారికి భవిష్యత్తులో సముచిత స్థానం ఉంటుందని భరోసా ఇచ్చారు.

'భారతరత్న'లు కాదు..

ఆశయాలు నెరవేర్చాలి

- గిట్టుబాటు ధరకు చట్టబద్ధత కల్పించాలి

- ఎస్‌కెఎం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆదర్శనీయుల ఆశయాలు కొనసాగించడం ద్వారానే వారికి తగిన గౌరవం లభిస్తుందని, కేవలం ఉత్తమ పురస్కారాల పేరుతో బిరుదులు ఇవ్వటం ద్వారా ఒరిగేది ఏమీ లేదని సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ స్వామినాథన్, మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారత రత్న పురస్కారాలు ఇవ్వటం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. అదే స్థాయిలో వారు చివరి శ్వాస వరకు వేటి కోసం ఎదురుచూశారో, వాటిని ప్రభుత్వాలు అమలు చేయడం ద్వారానే వారికి ప్రజలలో తగిన గుర్తింపు గౌరవం దక్కుతుందన్నారు. దేశీయ రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వటం ద్వారా దేశంలో వ్యవసాయ రంగాన్ని, రైతాంగాన్ని అభివద్ధి బాటలో నడిపించవచ్చని మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ పంటల గిట్టుబాటు ధరలకు విత్తనం వేశారన్నారు. అందులో భాగంగానే రైతాంగానికి సబ్సిడీలో ఎరువులు ఇప్పించటం, నాబార్డ్‌ను ఏర్పాటుచేసి దేశవ్యాప్తంగా రైతాంగానికి అన్ని రకాలుగా ఆదుకోవడానికి నిధులు కేటాయించేందుకు ఎంతో కషి చేశారన్నారు. ఆయన బాటలోని డాక్టర్ స్వామినాథన్ పంటల గిట్టుబాటు ధరల నివేదికను తయారు చేశారన్నారు. పండించిన పంటలకు సమగ్ర పెట్టుబడి ఖర్చులకు మరో 50 శాతం అదనంగా కలిపి గిట్టుబాటు ధరలు కల్పించడం ద్వారానే దేశంలో వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని తన నివేదికలో తెలిపారన్నారు. మాజీ ప్రధాని పివి.నరసింహారావు కొత్త ఆర్థిక విధానాలకు శ్రీకారం చుట్టాలన్నారు. ఆదర్శ పురుషులకు బిరుదులతో కాకుండా వారు ఏ ఆశయాల కోసం అయితే జీవించారో వాటిని అమలుపరచడం ద్వారానే వారికి నిజమైన గుర్తింపు, గౌరవం ఇచ్చినట్లవుతుందన్నారు. స్వామినాథన్ సిఫార్సులకు అనుగుణంగా పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో చట్టం తీసుకురావాలని చుండూరి రంగారావు డిమాండ్ చేశారు.

బాలోత్సవం 'భళా'

90 పాఠశాలల నుంచి సుమారు 3 వేల మంది హాజరు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

చంద్రుని మీదకి రాకెట్‌లను ఎలా పంపుతారు.? అనే ఒక ప్రయోగం.. మన ప్రకృతి మనకు ఏం చెబుతుందనే ఓ చిత్ర సందేశం.... ఈ దేశం ఎలా ఉండాలనే ఓ రచన.. మన సంస్కృతి, సాంప్రదాయాన్ని తెలియజేస్తూ ఓ నృత్యం.. జానపదాలతో హెూరెత్తిస్తూ మరో అద్భుత ప్రదర్శన.. ముగ్గులతో గణితం.. దేశ చరిత్రను చెబుతూ కథారచన.. దేశభక్తి గీతాలు, ఫ్యాన్సీ డ్రస్ సంబరాలు.. విచిత్ర వేషధారణలు, ముఖాభినయాలు.. ఏకపాత్రాభినయం.. ఇలా ప్రకాశం బాలోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు సందడి చేశారు. ప్రకాశం బాలోత్సవం కార్యక్రమం శుక్రవారం ఒంగోలు నగరంలోని పివిఆర్ బాలుర పాఠశాలలో ప్రారంభమైంది. చిన్నారులు ఆటపాటలతో అదరగొట్టారు. వారిలోని కళానైపుణ్యాలను ప్రత్యేక వేదికలపై ప్రదర్శించి.. అబ్బురపరిచారు. పిల్లలంతా పండుగ వాతావరణంలో సందడి చేశారు. కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి దాదాపు 90 పాఠశాలల నుంచి సుమారు 3 వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. సైన్స్ ఎగ్జిబిషన్, చిత్రలేఖనం, వ్యాసరచన, కార్టూన్, కథారచన, జానపద నృత్యాలు, శాస్త్రీయ నృత్యాలు, లఘునాటిక పోటీలు, దేశభక్తి గీతాలాపన, ఫ్యాన్సీ డ్రస్, విచిత్ర వేషధారణ, ఏకపాత్రభినయం జూనియర్, సీనియర్స్ విభాగాలలో నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో బాలోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం ఎంతో వ్యయం వెచ్చించి, ఎంతోమంది ఉద్యోగులను కేటాయిస్తే కానీ ఇలాంటి కార్యక్రమాలు విజయవంతం కావు. అయితే దాతల సాయంతో అందుబాటులో ఉన్న ప్రజాసంఘాల నాయకులు, వాలంటీర్లు, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులతో ప్రకాశం బాలోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. భారీ హెూర్డింగ్‌లు లేవు. భారీ ఎత్తున ప్రచారం లేదు. జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు వెళ్లి బాలోత్సవ కార్యక్రమం గురించి తెలియజేసిన వెంటనే వాటి నిర్వాహకులు స్పందించారు. బాలోత్సవానికి పిల్లలను తీసుకొచ్చారు. బాలోత్సవాలలో నిర్వహించిన ప్రదర్శనలు చూసి ఉపాధ్యాయులు కూడా భళా అన్నారు. ఈ కార్యక్రమం ప్రకాశం జిల్లా బాలలకు మొదటి పండుగ. శనివారం కూడా బాలోత్సవం సందడి చేయనుంది.





జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం, మాట్లాడుతున్న విరపు బాలసుబ్రమణ్యం



వ్యోమగామి వేషధారణలో చిన్నారి



చిన్నారుల జానపద నృత్యం



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు